ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

నవంబర్ 19, 2006

బులిపించే బుల్లిపెట్టె

హ్యాపీ బర్త్‌డే

(19.11.2006 నుండి
25.11.2006 వరకు)



చరిత
2సం॥, నవంబర్-19
రాధిక-తులసీరావు
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

టి.బన్ని
నవంబర్-19
లవలిక-రాజు
గిరాయిపల్లి-మెదక్

భగవద్గీత
2సం॥, నవంబర్-19
కళావతి-త్రినాథరావు
ఎల్‌బిఎస్ కాలనీ-శ్రీకాకుళం

డి. శివప్రసాద్
4సం॥, నవంబర్-19
రాజేశ్వరి-రాజయ్య
డోర్నకల్-వరంగల్

దర్పణ్ జైశ్వాల్
5సం॥, నవంబర్-19
సీమ-ధర్మేష్

ఓ. దీప్తి
7సం॥, నవంబర్-19
రాజు-రామకృష్ణ
సీతారామునిపేట-విజయనగరం



సి. హెచ్. సంతోష్‌కుమార్
4సం॥, నవంబర్-22
బాలామణి-సాయికుమార్
మాసానిపల్లి-నిజామాబాద్

పోతుకూరు జూహీ నాగశ్వేత
5 సం॥, నవంబర్-2001
రమాదేవి-లక్ష్మణ్ కిరణ్
ఆగిరిపల్లి-కృష్ణాజిల్లా.



ఎస్.కె. అఫ్రోజ్
1సం॥, నవంబర్-2005
రజియా-చాగాల్‌మీరా
నర్సింహులుగూడెం-నల్లగొండ

ఎం. లక్ష్మి
9సం॥, నవంబర్-1997
ఆదిలక్ష్మి-నరసింహారావు
రాగోలు-శ్రీకాకుళం

కె. సంజీవని
1సం॥, నవంబర్-2005
రాజమణి-రాజమల్లు
ధర్మారం-కరీంనగర్

బి. గురు చరణ్‌కుమార్
4సం॥, నవంబర్-2002
ప్రభావతి-పెద్దయ్య
వసంతనగర్-కర్నూలు



వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

మన అతిథి గురించి...

పేరు : డాక్టర్ మన్‌మోహన్‌సింగ్
పుట్టింది : 02-10-1959
స్వగ్రామం : బిలాస్‌పూర్, ఛత్తీస్‌ఘర్
చదువు : ఐఎఎస్, ఎంవిఎస్‌సి
వృత్తి : వైస్‌ఛాన్సలర్, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ
అనుభవం : పలు జిల్లాల కలెక్టర్‌గా, ప్రభుత్వ విభాగాల్లో ఉన్నతస్థాయి అధికారిగా
అభిరుచులు : పుస్తక పఠనం, యోగా, మార్నింగ్‌వాక్
ఇష్టమైన ఆహారం : ఉత్తరాది శాఖాహార వంటలు

డిగ్రీలు అందుకోవడమే ప్రధానం కాదు, విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి. మనం నేర్చుకున్న చదువు పదిమందికి ఉపయోగపడేదిగా ఉండాలి. విద్యతోపాటు ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి. ఆ దిశగా కృషి చేయాలి. విద్యార్థులను తీర్చిదిద్దేవి విశ్వవిద్యాలయాలేనని అభిప్రాయపడతాను. దేశానికి మంచి పౌరులను అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉంది. ప్రస్తుతం పశువైద్య విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి.

ఈ సంచికలో...

టపా ... 2
మనమూ మన నమ్మకాలు ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14

ఇంకా...



ఇలా వుందామా... 7
ప్రైవేట్ భూతం

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
పావలా ఇవ్వరూ....!

అవీ...ఇవీ ... 20
మనసా... తెలుసా ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24



చక్కటి జోక్స్

ఆదివారం అనుబంధంలో శీర్షికలు అన్నీ బాగున్నాయి. ఈ వారం క్యాంపస్ చాట్‌లో పున్నాగపూలు శీర్షిక బాగుంది. చదువు, భవిష్యత్తు విలువ విద్యార్థులకు తెలియజేసేట్లుగా ఉంది. ఈమధ్య జోక్స్ కూడా చక్కటివి ప్రచురిస్తున్నారు. ధన్యవాదాలు. సినిమాకబుర్లులో పరుచూరి గోపాలకృష్ణగారి అనుభవాలు చదవాలనిపించేలా ఉన్నాయి. చిన్నారుల కోసం ప్రచురించిన బాల నేస్తాలు శీర్షిక మా పిల్లలను బాగా ఆకట్టుకుంది.

కటారు శ్రీనివాసరావు, రమాదేవి,

కామేపల్లి, ఖమ్మం జిల్లా.

అవీ ఇస్తే బాగుంటుంది

5. 11.2006న నమ్మకాలు శీర్షికలో ప్రచురించిన 'చూస్తూ చూస్తూ...' బాగుంది. మనం మూఢనమ్మకాలతో ఇంకా స్వామిజీలనే నమ్మడం, వారిని నమ్మి ప్రాణాలు పోగొట్టుకోవడం, దారాలు, మంత్రాలు.. ఇలాంటి మూఢనమ్మకాలు ఇంకా తగ్గకపోగా ప్రబలుతున్నాయి. ప్రస్తుత సమాజంలో ఈ కథ వాస్తవానికి దగ్గరగా ఉంది. రచయిత మొలకలపల్లి కోటేశ్వరరావుగారికి అభినందనలు. వంటపని, వింతమనిషి కథ చాలా చక్కగా రాశారు. మహాలక్ష్మి ఏమీ తినక మంచాన పడ్డ వైనం చాలా బాగుంది. పెరటి చెట్టు కథలో మాస్టారు, డాక్టర్, తాజ్‌మహల్‌తో ఉదాహరణలు చాలా బాగున్నాయి. ఎవరి పెరటి చెట్టు వారికి పనికిరాదనే వాస్తవాన్ని తెలియజేశారు. సినిమా కబుర్లు ఆసక్తికరంగా వున్నాయి. కొత్త సినిమా విషయాలు కూడా తెలియజేస్తే బాగుంటుంది.

చిప్పాడ ఉమామహేశ్వరరావు, కురుపాం, విజయనగరం జిల్లా.

ఆకట్టుకుంది

కాటేసే కాస్మెటిక్స్ కథనంద్వారా అనేకానేక విషయాలను మాముందుంచారు. కాస్మెటిక్స్‌తో సహజీవనం తప్పనిసరి అయిన ఈ రోజులలో 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్లు ఆయా శరీర ధర్మాలను అనుసరించి వైద్య నిపుణుల మార్గదర్శకత్వంతో ఉపయోగించుకోవటం చాలా ముఖ్యమైందని, అందరూ గ్రహించాలి. 'విజ్ఞాన వీచిక'లో అసలు మధ్యాహ్నం నిద్ర ఎందుకు ముంచుకొస్తుందో చాలా చక్కగా వివరించారు. 'క్యాంపస్ చాట్ విభిన్నమైన అంశంతో అలరింపచేసింది. ఈ వారం ఆరోగ్యంలో డాక్టర్ దగ్గరికి వెళ్ళినప్పుడు పేషెంట్ ఏమేమి వెంట తీసుకెళ్ళాలీ, డాక్టర్ గారితో ఎలా సంభాషించాలి వంటి ఉపయుక్త సమాచారాన్ని అందించడం ఎంతో ప్రయోజనకరంగా ఉందనటంలో సందేహంలేదు. రుక్మిణిగారి 'ముర్గిపోయినై' కథ అందమైన తెలంగాణాయాసతో, ఆసక్తికరమైన కథనం, ఆకట్టుకునే శైలితో వుంది. మంచి కథను అందించినందుకు అభినందనలు.

నేమాన సుభాష్‌చంద్రబోస్,

ఇలిసిపురం, శ్రీకాకుళం

కృత్రిమసాధనాల మోజు

మన అతిథి శీర్షికలో మేధావుల అంతరంగాలు, సమాజానికి సత్ సందేశాలు అందిస్తున్నారు. మనమూ మన నమ్మకాలు మూఢ నమ్మకాలపై విముఖత కలిగిస్తోంది. తెలుగుగడ్డ ధారావాహిక, వీర తెలంగాణ విప్లవ పోరాట చరిత్రను జ్ఞప్తికి తెస్తోంది. ఈ వారం జోక్స్ అవీ, ఇవీ ఎంతో వినోదదాయకంగా ఉన్నాయి. జీవితంలో విశ్రాంతి తీసుకుంటున్న వయసు మీరిన వారికి స్నేహ సన్నిహిత స్నేహితునిగా పలకరిస్తున్నది. సమాజవికాసానికి ఉపకరించే విషయాలనేకం స్నేహలో ప్రచురిస్తున్నారు. మరిన్ని నూతన శీర్షికలతో పేజీలు పెంచాలని కోరుకుంటున్నాను. అట్టమీద కథ కాటేసే కాస్మెటిక్స్ సౌందర్యోపాసకులకు హెచ్చరికగా వుంది. ప్రకృతి సిద్ధమైన, పసుపు, సున్నిపిండి స్వచ్ఛమైన కొబ్బరినూనె, కుంకుడుకాయలు వుండగా, రసాయనాలను ఉపయోగించి ఉత్పత్తి చేసిన కృత్రిమసాధనాల మోజునుండి సౌందర్యోపాసకులు ఎంత తొందరగా బయటబడితే అంత మంచిది.

జి.వి. నరసింహరాజు, రామకృష్ణాపురం, రంగారెడ్డిజిల్లా

ఆలోచింపచేసేదిగా ఉంది

తాము ఎంతో అందంగా కనిపించాలని అతివలు, అలాగే పురుషులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అందుకోసం చేస్తోన్న ఖర్చు అంతాఇంతా కాదు. ఈ రంగుల ప్రపంచంలో తాము మెరిసిపోవాలని, ఆకర్షింపబడాలనీ ఉన్న సహజ అందానికి మెరుగులద్దాలనుకునేవారు కాస్మెటిక్స్ కాటుకు గురవుతున్నారు. ఈ వారం కాటేసే కాస్మెటిక్స్ ఆలోచింపచేసేదిగా ఉంది.

భాగ్యరాజ్, పొన్కల్.

బాగున్నాయి

అట్టమీద కథ బాగుంది. 'కాస్మెటిక్స్' వెనుక ఇంత కాటేసే తత్వం ఉందా అనిపించింది. కథనం బాగుంది. డాక్టర్ సలహాలు ఉపయోగకరంగా ఉన్నాయి. అదే విధంగా కార్టూన్స్, .జోక్స్ బాగున్నాయి. క్యాంపస్ ఛాట్‌లో 'పున్నాగపూలు' పరిమళించాయి. కథాంశం బాగుంది. మార్పు తెచ్చేదిగా ఉంది. హ్యాపీ బర్త్‌డే మేకప్ చక్కగా ఉంది. పరుచూరి చెప్పిన సినిమా కబుర్లు ముచ్చటగా ఉన్నాయి.

మురళి, హైదరాబాద్

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

రూ. 150/-కే

ఇవన్నీ!

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3913

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

మనమూ - మన నమ్మకాలు

బామ్మ ఉత్తరం

పి. జ్యోతి

"సూరీ ! ఏవిట్రా, ఆరిడ్లీలు పెడితే అర ఇడ్లీకూడా తినకుండా అలా చెయ్యి కడిగేసుకుంటున్నావ్?" ఆందోళనగా అంది వరలక్ష్మమ్మ, టిఫిన్ తినకుండా అర్ధంతరంగా లేచి చెయ్యి కడుక్కుంటోన్న కొడుకుతో.

"తినాలని లేదమ్మా" అన్నాడు సూరి, డైనింగ్ టేబిల్ వద్ద నుండి లేచి.

అక్కడే ఉండి భర్తకు లంచ్ బాక్స్ సిద్ధం చేస్తోన్న నీరజ "ఇవ్వాళే కాదండీ అత్తయ్యగారూ! ఈయనగారి వరస ఈమధ్య రోజూ ఇలానే ఉంటోంది. ఇదిగో కమ్మగా వండిపెట్టిన కూరలతో పట్టుకెళ్లిన లంచ్ బాక్స్ కోడి కెలికినట్టు కెలికి తిరిగి అలానే పట్టుకొచ్చేస్తున్నారు" దొరికిందే ఛాన్స్ అన్నట్టుగా భర్తమీద ఫిర్యాదు చేసింది నీరజ.

"నీరూ, సందు దొరికితే చాలు అమ్మకు నా మీద ఏం చెబుదామా అని కాచుక్కూచుంటావ్. అమ్మా! నువ్వు తన మాటలు నమ్మకు! నాకెందుకో ఏమీ తినాలనిపించడం లేదు" నీరజవేపు గుర్లిరిమి చూస్తూ తల్లితో అన్నాడు సూరి.

"పాపం వాడికి ఒంట్లో బాగోలేదేమో నీరజా! నువ్వు తొందరపడి వాణ్ణేమనకు. ఏరా! మరి డాక్టర్ దగ్గరకెళ్ళి చూపించుకుంటావా?" కోడలిని నెమ్మదిగా మందలిస్తూ కొడుకుతో అంది వరలక్ష్మమ్మ.

"అబ్బా, వరం! వాడికి ఒంట్లో బాగోలేకపోవడం కాదులే! మా అమ్మ మొన్నీమధ్యే కదా పోయింది, ఆవిడంటే వాడికి పిచ్చి ప్రేమ. బామ్మమీద బెంగ పెట్టుకుని ఉంటాడు. నాలుగురోజులు పోతే వాడే మామూలైపోతాడు గానీ వాణ్ణి వదిలెయ్" కాస్త విసుగ్గానే అన్నారు, భార్యతో పరమేశ్వరరావుగారు.

"బావుందండీ! మీరు చెప్పేది, ఎంత ప్రేమయితే మాత్రం తొంభయ్యేళ్ళు దాటినావిడ పోతే ఇలా తిండీతిప్పలూ మానేసి పసిపిల్లాడిలా బెంగపెట్టుకోవాలా? తినమని చెప్పాల్సింది పోయి వాడినే సమర్థిస్తారే?" అంటూ భర్తమీద కోపం చూపింది వరలక్ష్మమ్మ.

నీరజ లంచ్‌బాక్స్ అందివ్వడంతో హమ్మయ్య అనుకుంటూ ఇంటినుండి బయటపడ్డాడు సూరి.

ఆఫీసులో కూడా ఇలాంటి మాటలే ఎదురయ్యాయి సూరిబాబుకు. ఎలాగో సాయంత్రం వరకు అనీజీగా గడిపి తిరిగి ఇల్లు చేరాడు సూరి.

రాత్రి భోజనం చేశాననిపించాడు. బామ్మ గదిలోకి వెళ్ళాలనిపించింది సూరికి. ఆవిడుండగా ఒక్కరోజు కూడా తన వద్దకు వెళ్ళకుండా ఉండేవాడు కాదు.

గదిలోకి అడుగుపెట్టగానే టేబిల్‌పై నవ్వుతూన్న బామ్మ ఫోటోను దగ్గరగా వెళ్ళి చూశాడు. ఆ పక్కనే బామ్మ పడుకునే మంచం. ఆవిడ లేక బోసిగా అనిపించింది. దిండుకింద ఇవతలికి కనిపిస్తూ ఓ కాగితం మడత కనబడింది.

అదేవిటాని ఆసక్తిగా తీసి ఆత్రంగా చదవసాగాడు. ఒంకరటింకరగా, అడ్డదిడ్డంగా ఉన్నాయి అక్షరాలన్నీ.

'ఒరేయ్ బాచిగా....' అబ్బ! బామ్మే పిలిచినంత ఆనందం కలిగింది. అలా బామ్మొక్కతే పిలుస్తుంది మరి. కొండంత బలం వచ్చినట్టయి తరువాత విషయాలు చదవసాగాడు.

'..నేను పోతే నువ్వెంత బెంగపెట్టుకుంటావో నాకు తెలుసురా, అందుకే నీకోసం ఈ ఉత్తరం రాస్తున్నాను. నువ్వు చిన్నప్పటినుండి నా దగ్గర గారాబంగా పెరిగావు. రోజూ తెల్లవారగానే, నిద్ర లేవగానే మొదట నా ముఖమే చూసేవాడివి. అలా నేన్నీకు అలవాటు చేశాను. ఎందుకో తెలుసా...

నీకు లీలగా జ్ఞాపకం ఉండే ఉంటుంది. మనూరి బళ్ళో నువ్వు ఒకటోతరగతి చదివేటప్పుడు ఓరోజు బడికెళ్తూ దారిలో బండ తగిలి బోర్లా పడిపోయి మోకాలి చిప్పలు పగులగొట్టుకున్నావు. ఆ రక్తం చూసిన నువ్వు రాగాలు పెడుతూ తిరిగి ఇంటికొచ్చావు. ఓ పక్క బడి ఎంచక్కా ఎగ్గొట్టచ్చని నీకు లోలోన ఉన్నా నువ్వలా రావడం చూసి నేనెంత తల్లడిల్లిపోయానో, నీకు గుర్తుండే ఉంటుంది. అప్పుడే చిలికిన మజ్జిగలోంచి గబగబా వెన్నపూస తెచ్చి నీ మోకాళ్ళకు పూస్తూ, 'వెర్రినాగన్న! పొద్దున లేచి ఎవరి ముఖం చూశాడో ఏమో, బిడ్డ చావు దెబ్బ తగిలించుకున్నాడు' అన్నా బాధగా. అది విన్న నువ్వు 'బామ్మ ముఖం చూస్తే నాకు దెబ్బ తగలకుండా ఉండేదేమో' అన్నావు అమాయకంగా.

"బాబీ! ఇకనుండి నువ్వు నిద్రలేవగానే సరాసరి వచ్చి నా ముఖమే చూడు. ఎవరి ముఖం పడితే వారి ముఖం చూస్తే ఇలాంటివే ఎదురవుతాయి" అని నేను ఆరోజు నీకు ఏదో ధైర్యం చెబుతున్నట్లుగా చెప్పాను. నువ్వదే నిజం అనుకుని ఆరోజునుండి లేవగానే నా ముఖం తప్ప మరెవరిదీ చూడకపోయేవాడివి.

చిన్నప్పుడు పిల్లలకు ఏదైనా చెబితే అదే నిజమనుకుని పెద్దయినా ఆచరిస్తారు. అసలు నిద్రలేవగానే ఒకరిని చూస్తే మంచి, మరొకరిని చూస్తే చెడు జరగడం అనేది ఉండదు. అవన్నీ మనం కల్పించుకున్న పిచ్చి నమ్మకాలు. ఆరోజలా చెప్పిన నేనే ఇప్పుడు చెబుతోంది విను. రేపటి నుండి నిద్రలేవగానే ఎలాంటి చెత్త నమ్మకాలూ లేకుండా నీ పనులు మొదలుపెట్టు...' అని రాసుంది.

❋ ❋ ❋

అసలు విషయమేమంటే రోజూ నిద్ర లేవగానే బామ్మ ముఖాన్ని చూసే భర్త ఆవిడ పోయాక అందుగురించే బాధపడుతున్నాడని గ్రహించి ఇలా ఆవిడ రాసినట్టుగా వంకరటింకర అక్షరాలతో ఉత్తరం రాసి అతడికి కనిపించేట్టుగా దిండుకింద పెట్టి ఉంచింది నీరజ.

ఆవిడ పూర్వపు చాదస్తంతో ఏదో చెప్పి ఉంటుంది. దాన్ని భర్త ఇంత వాడై కూడా పాటిస్తూ ఆవిడపోయాక బాధపడడం అజ్ఞానం అనిపించింది. అది పోగొట్టడానికే ఇలాంటి పని చేసింది.

ఆ సంగతంతా ఓసారి బామ్మే నీరజతో చెప్పడంతో రాయడం సులువయింది.

ఉత్తరం చదివిన సూరికి నిద్రలేవగానే బామ్మ ముఖం చూడలేక పోతున్నాననే దిగులు ఇట్టే మాయమైంది. అసలు విషయమైతే గ్రహించలేదుగానీ ఓ అర్థంలేని నమ్మకంనుంచి బయటపడ్డాడు.

✤

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి.
న్యాయవాది
శ్రీ జి.ఎల్.నరసింహారావు
తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.
మా చిరునామా:
ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం,
స్ట్రీట్ నెంబర్: 1,
అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

వినిపించుకోవడం లేదు

మా చెల్లికి ఈ సంవత్సరం జులై 29న వివాహం అయింది. పెళ్లి అయిన 16 రోజులనుండి మా బావగారు విడాకులిస్తాను అంటున్నారు. దీనికి కారణం మా చెల్లికి చిన్నతనంలో అంటే ఆరు సంవత్సరాల వయసునుండి ఫిట్స్ వచ్చేవి. అవి క్రమంగా తగ్గిపోయాయి. ఇప్పుడు ఆమె వయసు 24 సంవత్సరాలు. పెళ్లి అయిన తర్వాత అత్తవారింట్లో ఫిట్స్ ప్రారంభమయ్యాయి. అయితే ఇబ్బంది ఏమీ కలుగలేదు. అప్పటినుంచి బావగారు, అత్తగారు ఈ అమ్మాయితో పడలేం అంటున్నారు. విడాకులు ఇవ్వాలనుకుంటున్నారు. నేను, మా పెద్దలు మా బావగారితో కలిసెళ్ళి మా చెల్లిని మంచి డాక్టరుకు చూపించాం. డాక్టరుగారు ఏమీ పర్వాలేదని, మందులు వాడితే తగ్గిపోతుందని అన్నారు. కాని బావగారు మాత్రం విముఖత చూపిస్తున్నారు. ఇప్పుడు మా చెల్లి మా ఇంట్లోనే ఉంది. మందులు వాడింది. ఫిట్స్ తగ్గాయి కూడా. ఒక్కసారి మా ఇంటికి వచ్చి వెళ్లండి అని అడిగితే 'నాకు రావలసిన పనిలేదు, రాను' అంటున్నారు. ఏ విధంగా చెప్పినా వినిపించుకోవడం లేదు. మాది సామాన్య కుటుంబం. నేను ఇంటర్ పాసయ్యాను. చిన్న షాపులో పనిచేస్తున్నాను. మా పరిస్థితి అర్థం చేసుకుని మీరు మాకు చక్కని సలహా ఇస్తారని తలుస్తున్నాను.

ఎస్.కె. సుబ్రహ్మణ్యం, నడకుదురు

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది
9848994240

మీరు పెళ్ళి చేసేముందు డాక్టర్‌ని సంప్రదించి పెళ్ళి అయ్యాక్కూడా గతంలోని ఫిట్స్ రావడం వుంటుందా, వుండదా, అందుగ్గానూ ముందస్తుగానే ఏమైనా మందులు వాడాలా అనేది తెలుసుకుని ఉంటే ఈ పరిస్థితి రాకపోయేది కదా. డాక్టర్‌గారి వద్దనుండి ట్రీట్‌మెంట్ పూర్తయ్యాక వారు సూచించిన మందులు వాడడంవల్ల భవిష్యత్తులో ఆ జబ్బు రాకపోవచ్చని ఏదైనా సర్టిఫికెట్ పొందగలుగుతారా? దాంతోనైనా మీ బావగారికి నమ్మకం కలగవచ్చునేమో. అతను రానంటే మీరే వెళ్ళి మీ బంధువులుగానీ వారి బంధువులకు గాని తెలిపి అత్త వారింట్లో దింపి సర్దిచెప్పించండి. అప్పటికీ కుదరకపోతే మీ దగ్గర్లో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సంస్థలను సంప్రదించండి. వాళ్ళయినా అర్థ మయ్యేటట్లు విడమర్చి చెప్తారు. లేదంటే చట్టపరంగా ఎదురయ్యే సమస్యల్ని తెలుసుకునేవిధంగా చేస్తేనైనా అతడి మనసు మారవచ్చును. కొత్తగా వచ్చిన చట్టం 'ప్రొటెక్షన్ ఫ్రం డొమెస్టిక్ వయొలెన్స్' ప్రకారం అక్కడ వుండికూడా చట్టపరంగా తగిన రక్షణ పొందవచ్చును.

ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

కొత్త పిచ్చి

ఆ రోజు ఆదిలక్ష్మి నిద్ర లేచింది మొదలు అన్ని పనులూ చకచకా చేసుకొని, తొందరగా అన్నగారింటికి వెళ్ళేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. అరవై ఏళ్ళు నిండిన అన్నయ్య నిన్ననే రిటైరై విశ్రాంతి జీవితం మొదలుపెట్టాడు. ఆ శుభ సందర్భంగా బంధువుల్ని, మిత్రుల్ని, కావలసిన వాళ్ళనీ, కాబోయే చుట్టాల్ని పిలిచి విందుభోజనం ఏర్పాటు చేశాడు.

"ఆదీ! నువ్వు కాస్త పెందలాడే రావే.. మీ వదినకి సాయంగా ఉండచ్చు" అని ఫోన్లో మరీమరీ చెప్పాడు.

"మీ బావగారు కాస్త ఆలస్యంగా వచ్చినా, నేను ముందే వస్తాన్లే" అంది ఆదిలక్ష్మి.

గుమ్మంలో ఆటో దిగుతుంటే ఎదురుగా వచ్చిన అన్నయ్యని చూసి గుర్తు పట్టలేకపోయింది. అంటే అతని రూపం, వేషం అంతగా మారిపోయాయన్నమాట.

ఎడంవైపు పాపిడి తీసుకుని కుడివైపుకి క్రాపు దువ్వుకునే రామలింగం, ఇప్పుడు కుడి పాపిడి తీసుకుని దువ్వుకునేసరికి ముఖం గుర్తు పట్టడమే కష్టమైంది. అలవాటు లేని పంచె కాళ్ళకి బందాలాడుతూ, ఎప్పుడైనా బోర్లాపడిపోయేలా వంకరటింకరగా నడుస్తూ ఎదురొచ్చేసరికి ఆదిలక్ష్మికి నవ్వు ఆగలేదు. ఆఫీసుకెళ్ళినన్ని రోజులూ, ప్యాంటూ, షర్టు టక్ చేసి, దానిమీద బెల్టు బిగించి, సాక్సు, బూట్లు కళ్ళకి ఫొటోగ్రే అద్దాలు.. భుజాన వేలాడే బరువైన నల్లరెగ్జిన్ బ్యాగు, దానిలో హాట్‌ప్యాక్‌లో సర్దుకున్న మూడు గిన్నెల భోజనం, కూలెక్స్‌లో మంచినీళ్ళు, చెయ్యి తుడుచుకునే న్యాప్‌కిన్, ముందు జిప్‌లో దువ్వెన, తల్నొప్పొస్తే రాసుకునేందుకు అమృతాంజనం, మరీ అవసరమవుతుందేమోనని ఎనాసిన్, అన్నీ సర్దుకుని సౌకర్యాలతో కదిలే రైల్వే కంపార్టుమెంటులా ఉండేవాడు. ఆఫీసుకి వేళకి వెళ్ళాలని, పూజలుచేయాలని అనుకోడు. లేచింది మొదలు తన సొంత పనులు, ఆవిడగారి అద్దెపనులు చేసి, పనికిరాని పోచుకోలుతో సరిగ్గా టైంకి కాస్తంత అన్నంతిని క్యారేజి సర్దుకుని బయలుదేరేవాడు. అందువల్ల నుదుటిమీద విభూదిరేఖలు గానీ నొసట కుంకుమ ఛాయలు గానీ ఉండేవి కావు. చాదస్తంగా ఉంటుందని సంధ్యావందనం లాంటివి చేయడు.

ఇంటికి రాగానే ఇంటి పనుల్లో భార్యకి సాయం చేసేవాడు. అలాగని ఆమె ఉద్యోగస్తురాలనుకునేరు. అదేం కాదు. భర్త వెళ్ళిన వెంటనే ఆమె బజార్లు పనులు చూసుకుని అతను రావడానికి అరగంట ముందు ఇల్లు చేరేది. వర్షం వల్లనో, ఎండవల్లనో, చలివల్లనో సాధారణంగా ఆమె తలనొప్పితో వచ్చేది. రోజూ పని ఉంటుందా అనకండి. ఆ బజార్లో ఎవరికేపని వచ్చినా ఆమె కూడా వెళ్తుంది. రామలింగం కూర తరగడం, కుక్కరు పెట్టడంలాంటి పనులు చేసేసి, టీ.వీ. ముందు కాసేపు కూర్చుని రెండుమూడు చెత్త సీరియల్స్ చూసేసి, భోంచేసి, పది కాకుండా పడకెక్కేసేవాడు. అతనికి పుస్తకాలు చదివే మంచి అలవాటు గానీ, సాయంత్రం స్నేహితులతో కాసేపు కాలక్షేపం చేసి వచ్చే ఉద్దేశం కానీ లేదు.

అలాంటి రామలింగం నిన్ననే ఉద్యోగ విరమణ చేసి గట్టిగా గాలిపీల్చుకున్నాడు. అంతేకాదు "ఈరోజు నుంచీ నేను పూర్తిగా మారిపోతున్నా, నా లైఫ్ కొత్తగా ప్రారంభిస్తున్నా.. రోజూ టేపురికార్డర్‌లో సుప్రభాతం వింటాను. దేవుడికి పూజ చేస్తాను. పంచెలే కట్టుకుంటాను, రామాయణం, భారతం, భాగవతం లాంటి మన గ్రంథాలు చదువుతాను. చివరికి ఉద్యోగ జీవితంలో ఉన్న క్రాఫ్‌కూడా మార్చేసుకుంటాను అని ప్రకటన చేశాడు.

"రావే ఆదీ! రావే, ఈరోజు నుంచి వేమన శతకం చదవడం మొదలుపెట్టాను. ఆహా! ఎంత గొప్పగా రాశాడే.. లోకం తత్వం ఎంత గొప్పగా చెప్పాడే" అంటూ ఆమె దగ్గరికొచ్చి మొదలు పెట్టాడు రామలింగం.

ఆదిలక్ష్మి అన్నగారి ఆనందం పంచుకోవడానికి ప్రయత్నిస్తూ "అవునురా అన్నయ్యా" అంది.

ఇంతలో దూరంనుంచి వదినగారి గొంతు కీచుగా వినిపించింది. "ఆమెని లోపలికి రానీయండి. వీధిలోనే నిలబెట్టి పురాణ కాలక్షేపం మొదలు పెడితే ఎలా?" అంటూ.

లోనికొచ్చాక వేమన పద్యాలు "నిక్కమైన నీలమొక్కటే చాలు.. ఆహా.... ఎంత ఖచ్చితంగా చెప్పాడు.." అంటూ మొదలుపెట్టాడు.



"విడ్డూరంగా మాట్లాడుతున్నావే? ఈ శతకాలేవో కొత్తగా వింటున్నట్టు" అంది.

"ఏమోనే.. నాకు ఉద్యోగంతోనే సరిపోయేది. చిన్నప్పుడు చదివావేమో గుర్తులేదు" అన్నాడు, తనొక్కడే ఉద్యోగం చేసినట్లు ఫోజుగా. మళ్ళీ మరో పద్యం అందుకున్నాడు. అంతటితో ఊరుకోక

"నేనీ పుస్తకాలు చదవడం వేదాంత చర్చలు చెయ్యడం, పూజలు, పుణ్యక్షేత్రాలు తిరగడం లాంటివి రిటైరయ్యాకే చేద్దామని ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాను. ఒన్ ఎట్ ఎ టైమ్ పాలసీ నాది" అన్నాడు భుజాలెగరేస్తూ.

అయితే నలభై ఏళ్ళుగా కనీసం న్యూస్ పేపరుకూడా చదవడం అలవాటులేని రామలింగం ఏ పుస్తకం పట్టుకున్నా ముందు ఆవలింతలు మొదలయ్యేవి. ఒక్క వాక్యమూ అర్థం కావడం కష్టంగా ఉంది. అందరికీ మంచి భోజనాలు పెట్టి తన భవిష్యత్తు కార్యక్రమాల్ని వివరించాడు. ఇంతలో ఆదిలక్ష్మి భర్త పద్మనాభశర్మ వచ్చేసరికి రామలింగానికి ఆవేశం వచ్చేసింది. బావగారు తెలుగుపండితునిగా కాస్త పేరుప్రఖ్యాతులు సంపాదించి ఉండటంవల్ల, ఇప్పుడే తన గొప్ప చాటాలనిపించింది.

"బావగారూ, ఐ వాంట్ టు రీడ్ భాగవత్ ఇన్ ఇంగ్లీష్ ఓన్లీ. ఎందుకంటే నాకు తెలుగస్సలు రాదు. చదివితే అర్థం కావడం లేదు" అన్నాడు

"మీకు తెలుగే అర్థం కాకపోతే ఇంక ఇంగ్లీషేమవుతుంది" అన్నాడా బావ చిరునవ్వుతో.

"తెలుగు కొత్త కదండీ.. ఇంగ్లీషంటే ఇన్నాళ్ళు దంచిపారేశాం కదా" అన్నాడు, 'విత్ రిఫరెన్స్ టు యువర్ లెటర్...' భాష తల్చుకుంటూ.

"కొత్త పిచ్చిలో మీకలాగే అనిపిస్తుంది గానీ, కొన్నాళ్ళు పోయాక అమ్మ దగ్గరకు పరుగెట్టుకొచ్చే పిల్లాడిలా తెలుగు దగ్గరకే వస్తారు" అన్నాడు బావగారు.

"మీరేదో కవిత్వంచెప్తున్నారు.. హీ... హీ.... హీ... "

"మాతృభాష అర్థం కాకపోతే మరేదీ అర్థంకాదు"

"ఏదైనా నాకు తెలుగులో కావాలంటే ఎలా?"

"పోతనగారి భాగవతం తెలుగే"

"తెలుగంటే నాకు పద్యాలుండకూడదు. వచనం అన్నమాట"

"మంచిది మీరింగ్లీషులోనే చదివి వెనక్కిరండి"

రిటైరయిన కొత్త పిచ్చిలో అన్నీ నమిలి బుగ్గన పెట్టేసుకోవాలనుకుంటే అదంత సాధ్యం కాదని రామలింగానికి చెప్పే ప్రయత్నంలో పడ్డారా బావగారు. ♣

ఇలా వృందామా...

మొలకలపల్లి కోటేశ్వరరావు

ప్రైవేట్ భూతం

మొన్న ఒక ఊరు వెళ్ళాల్సి స్టాండ్‌లో బస్ కోసం వెయిట్ చేస్తూ నిలబడ్డాను. దగ్గరి వూరే, ఆరు రూపాయల చార్జీ నేను వెళ్ళాల్సిన వూరికి.

బస్ రాలేదుకానీ, ఆటోలు ఒక దానివెంట ఒకటి వస్తూ నిలబడిన ప్రయాణీకుల్ని ఒక్కో ఆటోలో దాదాపు పదిహేను, పదహారుమందిని ఎక్కించుకుని పోతున్నాయి. ఒకరి ఒడిలో ఒకరు, ఒకరి భుజం మీద ఒకరు చొప్పున ఆటోల్లో కిక్కిరిసి పోతున్నారు. దూరప్రయాణానికి సూట్‌కేస్‌లో బట్టలు కుక్కినట్లుగా ఆటోవాలా జనాన్ని కుక్కికుక్కి ఎక్కించుకుంటున్నాడు. సైడ్ రాడ్ పట్టుకుని నిలబడి, గబ్బిలాల్లా వేలాడుతూ ప్రయాణీకులు!

"ఎక్కండి సార్... ఎక్కండి సార్..." అని ఇద్దరు ఆటోవాలాలు అదేపనిగా అడిగారు. నేను చిన్నగా నవ్వి, రానని సూచిస్తూ తల అడ్డంగా వూపాను. ఆటోలో జనం పెద్దగా లేకపోయినా నేను ఎక్కేవాడిని కాను. ఎందుకంటే నేను ఒక నిబంధన విధించుకుని పాటిస్తున్నాను. ఎలాంటి పరిస్థితిలో కూడా ప్రైవేట్ వాహనాలు ఎక్కకూడదని నా నిర్ణయం. కొంచెంసేపు వెయిట్ చేసిన తరువాత బస్‌వచ్చింది. ఎగువనించి వస్తున్న ఆ బస్‌లో కేవలం ఒక్కడంటే ఒక్కడే ప్రయాణీకుడు వున్నాడు. మూడుచక్రాల ఆటోలో అంతమంది ఎక్కి పోతుంటే బోల్డంత కెపాసిటీవున్న ఆర్టీసీబస్‌లో ఒక్కరు... ఇలా అయితే సంస్థకి ఎంతనష్టం?

డీజిల్, టైర్ల అరుగుదల, సిబ్బంది వేతనాలు, బస్సు, డిపోల మెయింటెనెన్స్ ఇవన్నీ చూస్తే సంస్థకి మామూలు నష్టాలుకాదు, ఎక్కువ నష్టాలే ఎదుర్కోవాల్సివుంటుంది. ఈ నష్టాలన్నీ ఎవరు భరిస్తారు? దొంగ సొమ్ముతో అపర కుబేరులైపోయిన మన రాజకీయ నాయకులు కానీ, మంత్రులుకానీ భరిస్తారా? అది జరిగే పనికాదు. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఈ నష్టాలన్నీ ప్రజల నెత్తిమీద పడేవే! ఏదో ఒక రూపంలో ఈ నష్టాలు వడ్డీతో సహా ప్రజలే భరించక తప్పదు.

మనం ప్రైవేట్ వాహనాలు ఎక్కితే ఆ డబ్బు అంతా ఎవరి జేబులోకి పోతుంది? ఒక వ్యక్తి జేబులోకి పోతుంది. ఆ డబ్బు సమాజానికి ఏమీ ఉపయోగపడదు. అదే ఆర్టీసీలో అయితే ఆ డబ్బు కార్మికుల సంక్షేమంకోసం వినియోగించవచ్చు. సంస్థ అభివృద్ధికీ, డిపోల అభివృద్ధికీ, షెల్టర్ల నిర్మాణానికీ, ప్రయాణీకులకి మంచి సౌకర్యాలు కల్పించడానికీ వినియోగించవచ్చు. మరిన్ని లాభాలు వస్తే తగ్గిస్తుందేమో. లేదా ఆ డబ్బు ప్రభుత్వానికి జమ చేస్తుంది.

ఈ ప్రైవేట్ వాహనాల వలన మరో తీవ్రమైన ప్రమాదం వుంది. వీటి సంఖ్య పెరిగినందువలన ధ్వని కాలుష్యం, వాయుకాలుష్యం ఏర్పడుతుంది. రద్దీ, వత్తిడీ పెరిగి రోడ్లు పాడైపోతాయి. ప్రమాదాలు సరేసరి! భద్రతలేని ప్రయాణం. ఇన్ని ఆటోలకు రోజుకు ఎన్ని లక్షల ఇంధనం కావాలి? అది తరిగిపోయే వనరు! ఎంతో జాగ్రత్తగా వాడుకుంటేనే తర్వాతి తరాలకు ఇబ్బంది లేకుండావుంటుంది.

మరి ఇన్ని నష్టాలుండగా ప్రభుత్వం ఈ ప్రైవేట్ వాహనాలకు ఎందుకు అనుమతి ఇస్తున్నది? ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడానికే వుందని చాలామంది అమాయకంగా అనుకుంటారు. అది నిజంకాదు. ఏ ప్రభుత్వమైనా ప్రజల ఆస్తులు హరించడానికి, ప్రజల శ్రమశక్తిని దోపిడీ చేయడానికే ప్రాముఖ్యత ఇస్తుంది. చట్టపరంగాపై, చట్టాలకి అతీతంగానూ బహుళజాతి సంస్థలు, ధనిక వర్గాలకు మేలు చేయడానికే ప్రభుత్వాలు కృషిచేస్తాయి.

ఆర్టీసీ బస్సులు ఖాళీగా తిరుగుతూ నష్టాలతో సతమతమవుతుంటే ప్రైవేట్ వాహనాలు జోరుగా లాభాలు మూటకట్టుకుంటున్నాయి కదా! ప్రభుత్వానికి ఈ విషయం తెలీదా? తెలిస్తే ఏం చేస్తున్నట్లు? ప్రభుత్వం సంస్థను కాపాడాలని గాక ఎలాగైనా నష్టాలు కలిగించి మూసేయాలని కాచుక్కూర్చుంది.

ఒక్క ఆర్టీసీకే కాదు, రాష్ట్రంలోని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలు చూడండి. ఒకప్పుడో వెలుగు వెలిగిన కళాశాలలు ఇవ్వాళ విద్యార్థులు లేక వెలావెలాపోతూ మూతపడటానికి సిద్ధంగా వున్నాయి. మారుమూల పల్లెటూళ్ళకు కూడా ప్రైవేట్ కళాశాలల బస్సులు వస్తూ విద్యార్థుల్ని ఎక్కించుకుపోతున్నాయి. పాలకేంద్రాలు, ఒకప్పుడు లాభాలబాటలో నడుస్తూ గ్రామీణ రైతుకీ, వినియోగదారులకీ ఎంతో మేలు చేసిన ఆ కేంద్రాలు మూతబడిపోయాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేట్ కేంద్రాలు పుట్టిముంచుతున్నాయి. బి.ఎస్.ఎన్.ఎల్, వి.ఎస్.ఎన్.ఎల్ లాంటివి తొందరలోనే అంతరించిపోయినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

ఇలా ప్రభుత్వ ఆస్తులు అంటే ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం కావడంతో నష్టం వాటిల్లుతోంది. ఇందుకు మనమేం చేయాలి? ప్రైవేట్‌కి దూరంగా వుండాలి. ఎలాంటి పరిస్థితిలో కూడా అవకాశం కల్పించకూడదు. అది కనిపించని భూతం. మెల్లగా మింగేస్తుంది. దానికి స్వార్థమే పరమార్థం. స్వలాభానికే దాని ప్రాధాన్యం! మనం ప్రభుత్వ సంస్థలకే వినియోగదారులమవుదాం. వాటినే ఆదరిద్దాం. వాటికే స్వాగతం పలికి జవ జీవం కల్పిద్దాం.

సీరియల్

గొల్లపూడి నారాయణరావు



జరిగిన కథ

హుస్సేను సాహెబు ఉడకబెట్టిన కోడిగుడ్లు, కాల్చిన చీకులు తీసుకురాగా, కాశింసాహెబు సారాజాడీ తెచ్చి సీలు తీశాడు. దాంతో పేకాడుతున్నవాళ్ళు, నిద్రపోతున్నవాళ్ళూ అంతా లేచొచ్చి సారా తాగడంలో మునిగిపోయారు.

(44వ భాగం)

పటేలు పొంగిపోయాడు. ధీమాగా రొమ్ము విరుచుకుని కూర్చున్నాడు. "మీకోసం నేను ఇంత మర్యాద చేస్తుంటే నన్ను ఇక్కడ వదిలిపెట్టి వెళ్తామంటున్నారుగదా?" అన్నాడు

"అరేభయ్యా నీకీ వద్లిపెట్టి నేను ఎక్కడ్కీ ఎల్తా?" అన్నాడు బడేమియా.

"మనికొండ వెళ్ళాలన్నారు గదా?" అన్నాడు పటేలు.

"ఇంకా ఎక్డా మన్కొండా? మన్కొండ దోపిడీ అయిపోయింది. మన్కొండ దేశ్‌ముఖ్‌గారు ఉడాయించి వుంటాడు" అన్నాడు బడేమియా.

రాత్రికి రాత్రే

హవల్దారు పకపకా నవ్వాడు. "మన్కొండ దేశ్‌ముఖ్ ఒట్టి దర్పోక్ మన్షి ఉన్నాడు" అన్నాడు. అతడు తిరిగి పకపకా నవ్వాడు. అతడి కళ్ళు ఎర్రగా మెరుస్తున్నాయి. కోడిగుడ్లు నోట్లో కుక్కుకుని జాడీలో గ్లాసును పెట్టి ముంచాడు. గ్లాసునిండా తీసుకుని గటగటా తాగేశాడు. పటేలువైపుకు చూస్తూ "బహుతచ్ఛాహై పటేల్ సాబ్" అన్నాడు.

తర్వాత అందరూ వరుసగా సారా పానీయాన్ని స్వీకరిస్తున్నారు. అంతలోనే బజారువైపు నుండి "జై సీతారాం, జై సద్గురు" అన్నమాటలు వినిపించాయి. అందరూ అటువైపు చూశారు. దేహమంతటా విబూది పూసుకుని చంకలో యోగదండం, చేతిలో కమండలం ధరించి బజారునబడి వెళ్తున్న సన్యాసి ఒకరు కనిపించాడు.

అతడు కనిపించగానే హవల్దారు మనసులో ప్రతాప్‌రెడ్డి మెదిలాడు. సన్యాసి వేషం వేసుకుని వచ్చాడని నిర్ణయించుకున్నాడు. మరుక్షణమే "వాణ్ణీ పట్కారండీ" అంటూ సిపాయిలను ఆజ్ఞాపించాడు.

సారా మైకంలో ఉన్న సిపాయిలు తూలుతూ లేచారు. సోలిపోతూనే సన్యాసి వైపుకు పరుగులు తీశారు. సన్యాసిని పెడరెక్కలు విరిచి పట్టుకుని వచ్చారు.

అక్కడివారందరూ సన్యాసి ముఖంలో ముఖం పెట్టి తీక్షణంగా చూస్తున్నారు. వారి చూపులకు సన్యాసి కంగారుపడి వెర్రిచూపులు చూడనారంభించాడు. హవల్దారు హంటరు తీసుకుని నిలబడ్డాడు. నిప్పులాంటి కళ్ళతో సన్యాసి వైపుకు ఉరిమి చూశాడు. "నీది పేర్ హేమ్టీ?" గద్దించినట్లుగా అడిగాడు.

సన్యాసికి సరిగా మాటలు పెగల్లేదు. వారందరి వైపుకు చూసి వణుకుతూ "సాధురాం" అన్నాడు.

హవల్దారు పకపకా నవ్వాడు. అతడలా నవ్వడం చూసి సన్యాసికి మరీ హడలెత్తిపోయింది. హవల్దారు సన్యాసికి మరీ సమీపంగా వచ్చి నిలబడి అతడి ముఖంలోకి తీక్షణంగా చూశాడు. "అరె బద్మాష్, నీదీ పేర్ ప్రతాప్‌రెడ్డి కాదూ?" అనడిగాడు.

సన్యాసికి మతిపోయినంత పనైంది. "ప్రతాప్‌రెడ్డి కాదు, నా పేరు సాధురాం అయ్యా" అన్నాడు.

హవల్దారు చేతిలోని హంటర్ సన్యాసి వీపుపై 'ఛళ్' మని మోగింది. సన్యాసి గోలకు లేచాడు. హవల్దారు మరీ మండిపడ్డాడు. "నువ్వు ప్రతాప్‌రెడ్డిలా ఉండావు... మాకీ మోసం చేస్తావు?" అన్నాడు.

సన్యాసి లబోదిబోమని మొత్తుకున్నాడు. దెబ్బలు తగిలిన చోటల్లా చేతితో సవరించుకుంటున్నాడు. పటేలు ముందుకువచ్చి సన్యాసి ముఖంలోకి పరీక్షగా చూశాడు. "వీడు ప్రతాప్‌రెడ్డి కాదు సాబ్" అన్నాడు.

హవల్దారు పటేలు వైపుకు ఉరిమిచూశాడు. "పటేల్ నీకీ హేం తెల్సును?" అని గాండ్రించాడు.

ఆ గాండ్రింపుకు పటేలు కుంచించుకుపోయాడు. అయినా నిజం మాట్లాడకుండా ఉండలేకపోయాడు. అందువల్లనే తిరిగి కలిగించుకున్నాడు. "హవల్దార్ సాబ్, ప్రతాప్‌రెడ్డి నాకు బాగా తెల్సును. ప్రతాప్‌రెడ్డి పోలికలెక్కడా ఈ సన్యాసిలో లేవు" అన్నాడు.

"నీవు గప్‌చుప్‌గా వుండవయా పటేల్. ప్రతాప్‌రెడ్డి అనేకం ఏషాల్ ఏస్కుని వస్తడు. నీకీ హేం తెల్సును?" అన్నాడు హవల్దారు.

బడేమియా పటేలు వైపుకు చూస్తూ మాట్లాడవద్దని సౌంజ్ఞ చేశాడు. అంతటితో పటేలు మౌనంగా ఉండిపోయాడు.

తర్వాత సన్యాసికి నాలుగు పక్కలా నలుగురు సిపాయిలు నిలబడ్డారు. యమదండంలాంటి దండాలనెత్తి బాదనారంభించారు. సన్యాసి గోలగోలగా అరుస్తూ గెంతులేయసాగాడు. కాసేపటికి అతని భుజాన ఉన్న జోలె కిందపడిపోయింది. జోలెలోని వస్తువులన్నీ బయటపడ్డాయి. గంజాయి, చిలుము, పిడికెడు పొగాకు, సూది, దారం, జామాయిల్ సీసా, బ్లేడు, చిన్న చురకత్తి ఇవన్నీ కనిపించాయి. హవల్దారు చురకత్తిని చేతిలోకి తీసికుని పరీక్షించాడు. పటేలు వైపుకు చూశాడు.

"చూడు పటేల్! సన్నాసుల్ దగ్గా కత్తుల్ ఉంటాయా?" అన్నాడు.

పటేలు మాత్రం మాట్లాడలేదు. తలూపి ఊరుకున్నాడు. కానీ సన్నాసిని బావి వద్దకు ఈడ్చుకుపోయారు. రుద్ది రుద్ది కడిగారు. చివరికి అతణ్ణి తీసుకువచ్చి పందిట్లో నిలబెట్టారు. అతడి ముఖం నల్లగా నిగనిగలాడుతూ కనిపించింది.

"నల్లరంగు వదల్టం లేదు సాబ్" అన్నారు సిపాయిలు.

హవల్దారు సాలోచనగా తలూపాడు.

పటేలు చిరునవ్వును ప్రదర్శించాడు. "అంతా హవల్దారుగారి పిచ్చి... ప్రతాప్‌రెడ్డి మేలిమి బంగారు రంగులో ఉండే మనిషి. ఇతడికి, ప్రతాప్‌రెడ్డికి పోలిక ఎక్కడా?" అన్నాడు.

ఆ మాటలు హవల్దారుకు అవమానకరంగా తోచినయ్. పటేలు తనను హేళన చేస్తున్నట్లు తలచాడు. చురచురా పటేలువైపుకు చూశాడు. "క్యా బేవకూఫ్ ఆద్మీహై?" అన్నాడు. "మాకంటే ఎక్వా ఏం తెలుసును? మేం హవల్దారు వుండాం" అన్నాడు తిరిగి.

పటేలు అవమానంతో తలవంచుకున్నాడు.

తిరిగి హవల్దారు మాట్లాడాడు. "వీడు నిజంగా ప్రతాప్‌రెడ్డిలా ఉన్నాడు. నల్లరంగు పుల్ముకుని వచ్చినడు, ద్రావకం వేస్తే అస్లీ దేహం బయ్టా పడ్తది" అన్నాడు. అతడి మాటలను పటేలు తప్ప మిగతావారందరూ సమర్థించారు. సన్యాసి చేతులు, కాళ్లూ బంధించి గదిలో పడవేసి తాళం పెట్టారు తర్వాత.

ఆరోజు అంతా పటేలు బాధపడ్డాడు. సన్యాసిని పట్టుకుని బాధలు పెట్టడం అన్యాయమని తలచాడు. ద్రావకం వేస్తే అసలు దేహం బయటపడుతుందనే హవల్దారు వాదన గుర్తుకు వచ్చి అతడి దేహం జలదరించింది. ద్రావకం వేయగానే సన్యాసి చావు ఖాయమని నిర్ణయించుకున్నాడు. పాపం, పుణ్యం తెలియని సన్యాసి తన ఇంట్లో హత్యకు గురవుతున్నాడని తలచుకుని ఎంతగానో విచారించాడు. ఇలాంటి ఆలోచనలతో అతడు సతమతమవుతుండగానే పొద్దుగూకింది. ఒంటరిగా ఉన్న అతడి వద్దకు బడేమియా వచ్చాడు.

"పటేల్ సాబ్, విచారం పడ్తన్నావ్ దేన్కి?" అని మందలించాడు.

పటేలు నెమ్మదిగా తలెత్తి బడేమియా వైపుకు చూశాడు. "మిమ్మల్ని నమ్ముకుని మీలో తిరుగుతున్నందుకుగానూ హవల్దారుగారు అందరిలోనూ నన్ను అవమానం పాలు గావించాడు" అన్నాడు.

"బడేమియా చిరునవ్వు నవ్వాడు. "అయ్యా మిలట్రీ హవల్దారు ఉన్నాడు. ఆయ్నా మీకీ తిట్టడు. అందర్కీ తిట్టడు. తిట్టటాన్కీ కొట్టటాన్కీ అధికారం ఉంది. అయినా ఆయ్నా మాటల్ని మనం పట్టింపు చేయకూడదు" అన్నాడు.

పటేలు తలూపాడు మౌనంగా ఊరుకున్నాడు.

బడేమియా తిరిగి మాట్లాడాడు. "ఏం మనిషీ ఉన్నావయా పటేల్ సాబ్. ఈ కాస్తా దాన్కే విచారం చేస్తున్నావు? నీకీ మాట మిగిలింతర్వాత హవల్దారు సాబ్ కూడా విచారం పడినడు. ఇప్పుడు నీకీ పిలస్కారమ్మని నాతో చెప్పినడు" అన్నాడు. అతడు పటేలు చేయిపట్టుకుని లేవదీశాడు.

తర్వాత పటేలు తప్పనిసరిగా బడేమియా వెంట బయల్దేరాడు. ఇర్వురూ కలిసి పందిట్లో ఉన్న హవల్దారు వద్దకు వెళ్లారు.

హవల్దారు నవ్వుతూ ఎదురుగా లేచివచ్చాడు. పటేలు చేయిపట్టుకుని ఊపాడు "పటేల్ సాబ్, మీకీ మామీద గుస్సా వచ్చింది?" అన్నాడు.

"అబ్బే మీమీద గుస్సా ఏమీ లేదు" అన్నాడు.

హవల్దారు పకపకా నవ్వాడు. పటేలు వీపుపై చేయివేసి దువ్వాడు. మంచిగా మాట్లాడాడు. దాంతో పటేలు లోపలి ఆవేదన అంతా మటుమాయమైపోయింది. ఎప్పటిమాదిరి వారిలో కలిసిపోయాడు.

❋ ❋ ❋

సరిగా రాత్రి రెండు ఝాముల వేళ అయింది. వరండాలో పడుకున్న పటేలు నెమ్మదిగా ముసుగు తొలగించి చూశాడు. హవల్దారు, బడేమియా వగైరాలందరూ గురకలు పెట్టి నిద్రపోతున్నారు. ఏమాత్రం సడీ చప్పుడు లేకుండా మంచంమీద నుంచి లేచాడు. నల్లని జంపకానా ముసుగేసుకున్నాడు. సందు దోవనబడి దొడ్లలో గుండా మామిడితోట పెండెం మొత్తకు చేరుకున్నాడు. మొలలోనున్న తాళంచెవులను తీసి తాళం తెరిచాడు. పెండెం తీసుకుని తోటలో ప్రవేశించాడు.

తోట అంతటా గాఢాంధకారమయంగా ఉంది. చెట్ల కింద కన్ను పొడుచుకుని చూసినా కానరాని చీకటి ఉంది. కాలి కిందపడిన పండుటాకులు గలగలలాడుతున్నాయి. చెట్ల కొమ్మలలో నుండి ఈలపురుగుల రాగం కీచుమని సాగుతోంది. మిణుగురు పురుగులు మాత్రం మిణుకు మిణుకుమని మెరుస్తూ చెట్ల కొమ్మలలో తిరిగి పోతున్నాయి. పటేలు నిర్భయంగా ముందుకు నడకసాగించాడు.

తోట మధ్యనున్న గున్న మామిడి చెట్టును సమీపించాడు.

గున్న మామిడికింది నుండి "దొరా ఇక్కడే ఉన్నాను" అన్న రూబేను మాటలు వినిపించాయి.

పటేలు నిలబడిపోయాడు. గున్నమామిడి కింద నీడలాంటి ఆకారం కనిపించింది. "నాకన్నా ముందుగానే వచ్చావు. లోపలికెట్లా వచ్చావురా? తోటకు తాళం వేసి ఉంటేను?" అన్నాడు.

రూబేను సన్నగా నవ్వాడు. "మీకు తెలియనిదేముంది దొరా? మా దోవలు మాకు వుంటాయి" అన్నాడు.

"ఆరి నీ దుంపతెగా" అన్నాడు పటేలు. రూబేను ఎలా తోటలోకి ప్రవేశించాడా అనేది ఆలోచిస్తూ ఆశ్చర్యంతో చెట్టు కిందకి నడిచాడు. రూబేనుకు పక్కగా చీకటిలో కూర్చున్నాడు. "ఏమిట్రా? ఇక చెప్పు" అన్నాడు.

"యానాదాళ్లు మహా మొండి ముండాకొడుకులు దొరా. అప్పటికప్పుడే భాగాలు వేయాలని కూర్చున్నారు. బలుసుల జాలుదగ్గర కయ్యల్లో భాగాలు పంచుకుని వెళ్లిపోయారు. ఈ మూట మన భాగానికొచ్చింది" అన్నాడు రూబేను.

తవుళ్లాడుతూ మూటపట్టుకొని చూశాడు పటేలు. "మనది సగభాగం గదా. ఇంతచిన్న మూటట్రా?" అన్నాడు.

"దొరా, సత్తెపెమాణంగా చెబుతున్నాను. ఇందులో నుండి ఒక్క నగకట్టు కూడా నేను తీయలేదు. యానాదివాళ్ల దగ్గర పంచుకుని కట్టిన మూటను తిరిగి కదిలించనేలేదు"

"నీవు తీసుకున్నావని అంటున్నాన్రా? ఆమాత్రం నమ్మకం లేకుండానే నిన్ను పంపానని అనుకుంటున్నావా?"

"అంతమాత్రం నమ్మకం ఉంటే చాలు దొరా. మీ బానిసోణ్ణి.. మీ చేతి మీదుగా పెట్టింది తినేవాణ్ణి"

"సరేలేరా" అన్నాడు పటేలు. మళ్లీ మూటపట్టుకుని చూశాడు. "ఇంతకూ మన భాగం వచ్చిన బంగారం ఒక్క కట్టెడయినా ఉంటుందా?" అన్నాడు తిరిగి.

"ఒక కట్టెడేమిటి దొరా? ఇక్కడికి మోసుకు వచ్చేసరికి నా మెడలు కుదబడి పోయినాయి. ఎంత లేదనుకున్నా మూడు మళ్ల బంగారం ఉంటుంది"

"ఈ మూటే మూడు మళ్లు బరువుంటుందటరా?" అన్నాడు పటేలు. మూట రెండుచేతులా పట్టి పైకెత్తబోయాడు. ఆ మూట భూమిమీదనుండి ఎంతమాత్రం కదలలేదు. మూటను వదిలి "చాలా బరువుగా ఉందిరా" అన్నాడు.

"చూపులకు కాస్తే ఉన్నా, బంగారం మాలావు బరువుంటదిగదా దొరా"

"సరేలే మూట విప్పు. ఏమేం నగలున్నాయో చూద్దాం" అన్నాడు పటేలు. అతడు జేబులోంచి కొవ్వొత్తిని తీసి వెలిగించాడు. ఈ లోపునే రూబేను నగల మూటను విప్పదీశాడు.

పటేలు కళ్లు ఒక్కసారిగా జిగేల్‌మని మెరిసినయ్. నాలుగు క్షణాలపాటు విభ్రాంతుడయిపోయాడు. తర్వాత ఒక్కో నగను చేతిలోకి తీసుకుని పరీక్షగా చూస్తున్నాడు. పది నిమిషాలు గడిచిపోయినయ్.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

సమీర్‌చక్రవర్తి

అతి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మూడో నెంబరు ప్లాట్‌ఫాంపై తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు కదలడానికి సిద్ధంగా ఉంది. అది రోజూ జంటనగరాల నుండి షాద్‌నగర్, మహబూబ్‌నగర్‌లకు వెళ్ళి చదువుకునే ఇంజనీరింగ్ విద్యార్థులు, వీళ్లకు పాఠాలు చెప్పే లెక్చరర్లతో నిండిపోయి చిన్నపాటి క్యాంపస్‌ను తలపింపజేస్తూ ఉంటుంది. ఒక్కొక్క కాలేజీకి చెందిన విద్యార్థులు ఒక్కొక్క బోగిలో కూర్చుంటూ ఉంటారు. అలా కూర్చోమని రైల్వే శాఖ ఆదేశించలేదు. ఆనవాయితీగా జరిగిపోతూ ఉంటుంది.

రోజూలాగానే షాద్‌నగర్ ముంతాజ్ కాలేజీలో ట్రిపుల్ ఇ రెండోసంవత్సరం చదువుతున్న శశిధర్, షబ్బీర్, సుబ్రహ్మణ్యం, సారిక, జ్యోతి, రాధిక, సుష్మ ఒకచోటనే కూర్చున్నారు. రైలు కదలడానికి సిద్ధమవుతున్న సమయంలో షబ్బీర్ కళ్లు మూసుకొని ఏదో ప్రార్థిస్తున్నాడు. అతని మోహంలో తెలీని భయముంది.

స్నేహితుని మొహంలో కన్పిస్తోన్న కంగారు చూసిన సుబ్రహ్మణ్యం "ఏంటి మొక్కుతున్నావు?" అనడిగాడు షబ్బీర్‌ని.

"అదేరా బాబూ.. అప్రశాంత్‌గాడు ఈరోజన్నా రాకుండా ఉంటే బాగుండునని మొక్కుకుంటున్నా" అన్నాడు షబ్బీర్.

వీరి బ్యాచ్‌మేటయిన ప్రశాంత్‌ది ప్రత్యేకమైన నడవడిక. అతగాడు మొదటి సంవత్సరం మార్కుల్లో టాపర్‌గా నిలిచాడు. నాలుగు భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడు. అన్ని విషయాల్లోనూ ముందున్నట్టుగానే తినడంలోను ఫస్టే. వెయిట్‌విషయానికొస్తే తొంభై కేజీలు దాటి సెంచరీకి రెడీగా ఉన్నాడు. లావుకు తగ్గట్టే అతితిండి, అతిచొరవ వంటి అవలక్షణలున్నాయి. అందుకే అతగాణ్ణి స్నేహితులు ముద్దుగా అప్రశాంత్, బకాసుర్ అని చాటుగా పిలుచుకుంటారు.

అతగాడు ఈరోజు రాకుంటే బాగుండునని షబ్బీర్ ఆ పైవానికి మొరపెట్టుకున్నా ఆలకించనట్టులేదు. రైలు కదలడం మొదలవగానే టంచన్‌గా వాలిపోయాడు ప్రశాంత్. స్నేహితులెవరూ టీమ్‌లీడర్ బాధ్యతలు అప్పగించకపోయినా అతగాడు మాత్రం లీడర్‌లాగానే వ్యవహరిస్తాడు. రైలు ఎక్కింది మొదలు ప్రసంగాలు చేయడం మొదలెట్టాడు.

"ఏరా సుబ్రహ్మణ్యం! మీ 'బంగారం' ఫ్లాప్‌రా. మా'పోకిరి' ముందు ఇత్తడయిపోయ్యాడు. మీవోడికి ఈ జన్మలో హిట్ సినిమా రాదు వదిలేసెయ్" అన్నాడు ప్రశాంత్ స్నేహితుని రెచ్చగొట్టేలా.

అతని మాటలకు కొంతమంది అమ్మాయిలు పెద్దగా నవ్వుతూ కోరస్ పాడారు. ప్రశాంత్ లీడర్ పొజిషన్ నుండి హీరోకి మారిపోయాడు. ఆపకుండా స్నేహితులు ఆటపట్టిస్తునే ఉన్నాడు. శశిధర్, షబ్బీర్, సుబ్రహ్మణ్యం ఇంటినుండి తెచ్చుకున్న టిఫిన్‌బాక్స్‌లను ఆటపట్టించడంలో భాగంగా సిగ్గులేకుండా ఖాళీచేశాడు ప్రశాంత్. కాలేజీ ఊరుబయట ఉండడంతో మాడడం వాళ్లవంతైంది.

ప్రశాంత్ చదువు కారణంగా కడుపుకాలినా మనసులో తిట్టుకోవడం

తప్ప స్నేహితులు అతణ్ణి ఏమనలేకపోయారు. ఈ అనుభవం వారికిదే మొదటిసారి కాదు. అంతకుముందు చాలాసార్లు చేయడం వల్లే అతనికి అప్రశాంత్, బకాసుర్ అని పేర్లు పెట్టారు స్నేహితులు.

కాలేజీ నుండి తిరిగొచ్చేటప్పుడు షబ్బీర్ "ప్రశాంత్‌కిది అలవాటుగా మారుతోంది. మనం ఏదో ఒకటి చెయ్యాలి" అన్నాడు స్నేహితులతో.

స్నేహితులంతా కలిసి ప్రశాంత్‌కు గుణపాఠం నేర్పాలని నిశ్చయించుకున్నారు.

మరుసటి రోజు నుండి ప్రశాంత్‌ను ఏమార్చి రైలులో ప్రయాణించేటప్పుడు అతనికి దూరంగా కూర్చోడం... అతణ్ణి ఒంటిరివాణ్ణి చేయడం... అప్పుడప్పుడూ అతని లంచ్‌బాక్స్ కాజేసి ఆకలంటే ఏంటో తెలిసేలా చేయడం... ఇలా సాగింది రెండు వారాలపాటు వారి గుణపాఠం. రెండు వారాల్లో ఐదుకేజీల వెయిట్ తగ్గడంతోపాటు, అహం తగ్గి స్నేహితులకు సారీ చెప్పాడు ప్రశాంత్. ఎప్పుడైనా ప్రశాంత్ మళ్లీ రెచ్చిపోతే స్నేహితుల్లో ఎవరైనా "వద్దురా సోదరా! మొహమాటం వద్దురా" అంటూ ఓ పేరడి సాంగ్ ఎత్తుకుంటారు.

అంతే మిగతావాళ్లకి విషయం అర్థమవుతుంది. ఆట మొదటికొస్తుంది.

కాస్త అటూఇటూగా ఆ బోగిలో రోజూ ఇలాంటి సన్నివేశాలే ఎదురౌతుంటాయి. ✤



సినిమా కబుర్లు

చందు

సినీ రచయిత

శ్రీ పరుచూరి గోపాలకృష్ణ

చెప్తోన్న కబుర్లు

ప్రేమ, ఫ్యాక్షన్ ప్రేక్షకులకు బోర్ కొట్టడం లేదు

[illegible] చిత్రం: పౌరాణికాలు, జానపదాలకు [illegible] ఉండిపోయింది. ఎం.ఎ సాహిత్యం [illegible] చారిత్రాత్మకాలు అద్భుతంగా [illegible] అవగాహనుంది. భాష లేకపోయినా [illegible] చిత్రాన్ని 2007లో చూడనున్నారు. [illegible]

ట్రెండ్‌కు అనుగుణంగా మారాం

1996వరకూ పరుచూరి బ్రదర్స్ వేరు. 1997లో 'ప్రేమించుకుందాం [illegible] చిత్రంనుంచి పరుచూరి బ్రదర్స్ వేరు. 1998లో 'ప్రేమంటే ఇదేరా!', 1999లో '[illegible]' తర్వాత మా ట్రెండ్ వచ్చింది. మేం రాశాం కాబట్టి మా ట్రెండ్ [illegible] అనుగుణంగా మేమే మారాం. పాత తరహా చిత్రాలు [illegible] ఎగతాళిగా కొందరు, ఎబ్బెట్టుగా మరికొందరు చూస్తున్నారు. దీంతో సమాజసేవాభావంతో వచ్చిన పరుచూరి బ్రదర్స్ యూత్‌కు లొంగి ఫ్యాక్షన్, ప్రేమ సినిమాలు రాశారు.

ఎలక్ట్రానిక్ మీడియాతో పరిస్థితి మారిపోయింది

ఒకప్పుడు సమాజంలో ఉన్నటువంటి విషయాలు, జరిగిన సంఘటనలు తీసుకుని రాస్తూ ఉండేవాళ్ళం. కానీ ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. ఈరోజు చోటుచేసుకున్న ఓ సంఘటన రేపో, ఎల్లుండో సీరియల్స్‌లో రావడంతో చాలామంది ప్రేక్షకులు చూసేస్తున్నారు. గతంలో సినిమా ఒక్కటే డామినేటింగ్ మీడియా కాబట్టి ఏదన్నా కోకాపేట గురించి రాయాలన్నా, మూసీనది గురించి రాయాలన్నా సినిమాలో ఒక అంశంగా పెట్టుకుని ఒక సీక్వెన్స్‌గా చేసుకుంటూ పోయేవాళ్ళం. ఈ విషయాలను టీవీల్లో చూపించేయడంవల్ల ఆ అవకాశం లేకుండాపోయింది. అందుకే ప్రేమ, ఫ్యాక్షన్ అంశాలను కథలుగా ఎంచుకుని చూపిస్తున్నాం. వీటిని ఎన్నిసార్లు చూసినా ప్రేక్షకులకు బోర్ కొట్టడం లేదు.

సమాజసేవ చేయాల్సిన వాళ్ళని విలన్లుగా చూపెట్టాం

1930లో పౌరాణికాలు, జానపదాలచుట్టూ సినిమాలు తిరిగాయి. ఆ తర్వాత 'మాలపిల్ల', 'వందేమాతరం', 'రైతుబిడ్డ' వంటి సామాజిక స్పృహ ఉన్న చిత్రాల నిర్మాణం కొనసాగింది. గూడవల్లి రామబ్రహ్మం వంటివారు గొప్ప చైతన్యాన్ని తీసుకొచ్చారు. 1960 వచ్చేసరికి కుటుంబ కథా చిత్రాల(ఉమ్మడి కుటుంబం, ఆదర్శ కుటుంబ వ్యవస్థ) వైపు పయనం సాగింది. ఈ తరహా చిత్రాలకు సమాంతరంగా పౌరాణికం, జానపదం, చారిత్రాత్మక చిత్రాలు కూడా వచ్చాయి. 1977లో 'అడవి రాముడు', 'వేటగాడు' వంటి చిత్రాలతో కమర్షియల్ ట్రెండ్ వచ్చింది. ఆ దశలో 'చలిచీమలు'తో ప్రవేశించాం. 1979లో మాదాల రంగారావుగారి 'యువతరం కదిలింది', 'ఎర్ర మల్లెలు' వేజెళ్ళగారి 'ఇది కాదు ముగింపు', 'ఈ చరిత్ర ఏ సిరాతో', 'ఈ పిల్లకు పెళ్లవుతుందా', 'రోజులు మారాయి', 'మరో మలుపు', 'ఈనాడు', 'నాదేశం' వంటి చిత్రాలతో సామాజిక స్పృహ వైపుకి జనాలను తీసుకొచ్చాం. మేమొచ్చిన తర్వాత ట్రెండ్‌గా అంతకుముందు లేంది(అసలు లేంది కాదు), ఇండస్ట్రీలోకి తీసుకొచ్చిన పాయింట్‌గా చెప్పాలంటే... నిజానికి డబ్బున్నవాడు విలన్ కాదు, సూర్యాకాంతమ్మ విలన్ కాదు. ప్రజలను కాపాడాల్సిన చట్టం, న్యాయం, రాజకీయమే వాళ్ళని కాపాడడంలేదు. కాబట్టి వాళ్ళే నిజమైన విలన్స్ అన్నట్లు పాత్రలు సృష్టించడం మొదలుపెట్టాం. ఉదాహరణకు 'ఈ పిల్లకు పెళ్ళవుతుందా'లో 'గోడకు కొట్టిన సున్నం పోలీస్ స్టేషన్ కొచ్చిన సొమ్ము తిరిగి రావు' అన్నాం. అప్పట్లో ఈ డైలాగ్ ఒక సంచలనం. 'ఖైదీ'లో చిరంజీవి పోలీసులను విరక్కొట్టేస్తాడు. ఇదొక సాహసం. పోలీస్ వ్యవస్థ మీద హీరో తిరుగుబాటు చేయడం ఒక సంచలనం. ఆ తర్వాత ఈ తరహా సన్నివేశాలనుఎన్నో సినిమాల్లో పెట్టారు. 'ఈనాడు'లో హీరో రాజకీయ వ్యవస్థమీద తిరుగుబాటు చేస్తాడు. ముఖ్యమంత్రిని నడిరోడ్డు మీద నిలబెట్టాం. కొన్ని మీటింగ్స్‌లో ముఖ్యమంత్రినే నిలదీసి అడుగుతున్న పరిస్థితి నెలకుందిప్పుడు. ఇలా సమాజానికి సేవ చేయాల్సినవాళ్ళని విలన్లుగా చూపించడం మాతోనే వచ్చింది. మాదాల రంగారావుగారు, టి. కృష్ణగారు, ఆర్. నారాయణమూర్తిగారు కూడా ఈ దారిలోనే వెళ్ళారు. కాకపోతే మేం కమర్షియల్ సినిమాల్లో కూడా ఈ అంశాన్ని వాడాం.

అవసరముంటే ఐదు పేజీల డైలాగ్స్ అయినా వింటారు

అప్పుడైనా... ఇప్పుడైనా... బాగుంటే ఎంత పెద్ద డైలాగైనా వింటారు. కాకపోతే సన్నివేశం డిమాండ్ చేయాలన్నది ప్రధానం. 10 సంవత్సరాల క్రితం 1995లో 'పెదరాయుడు' సినిమా వచ్చింది. సత్యమూర్తిగారు రాసిన 'ఫిష్ అండ్ ఫిషర్‌మేన్...' అంటూ వచ్చే పెద్ద డైలాగ్ విని చివరికి చప్పట్లు కొట్టేశారు. అవసరముంటే ఐదు పేజీలైనా వింటారు. అవసరం లేనప్పుడు ఒక్క మాటైనా బోరుకొడుతుంది. సినిమా అనేది దృశ్యకావ్యమని ఇండస్ట్రీ అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది. రాంగోపాల్ వర్మ శబ్దానికి విలువివ్వడం మొదలుపెట్టాడు. ఒకప్పుడు మిక్సింగ్ అంటే ఒక నైట్‌లో చేసేవాళ్ళం. కానీ నేడది 20 నుండి 40 రోజులు పడ్తోంది. అంటే శబ్దానికి ప్రాధాన్యత పెరిగింది. మనం రాస్తూ ఆర్టిస్టులు డైలాగ్స్ చెప్పుకుంటూ పోతే ఉపయోగం ఉండదు. రీరికార్డింగ్‌తోనే ఫీల్ వస్తుంది.

మంచి డైలాగ్స్... పంచ్ డైలాగ్స్...

డైలాగ్స్ రెండు రకాలు. ఒకటి మంచి డైలాగ్స్. రెండు పంచ్ డైలాగ్స్. 'రోగిని ప్రేమించలేని డాక్టర్ కూడా రోగితో సమానం' అనేది మంచి డైలాగ్. 'మొక్కే కదా అని పీకి పారేస్తే పీక కోస్తా' అనేది పంచ్ డైలాగ్. 'ప్లేస్ నువ్వు చెప్పినా సరే... నన్ను చెప్పమన్నా సరే... కత్తులతో కాదురా కంటి చూపుతో చంపేస్తా'. ఇవి కూడా పంచ్ డైలాగే. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి కొన్ని ఇలాంటి డైలాగ్స్ రాస్తాం. 'మందు కంటే విషం తొందరగా పని చేస్తుంది అన్నయ్యా...' అని స్టాలిన్ చిత్రంకోసం రాశాం. దీన్ని పంచ్ అనకూడదు. అది మంచి డైలాగ్.. 'చిన్నప్పుడు నిన్ను కొడదామనుకున్నాను. మా అమ్మ అడ్డం వచ్చింది. ఇవ్వాళా నిన్ను కొట్టాలని ఉంది. మా చెల్లెలు అడ్డం వస్తోంది' అని 'మనసంతా నువ్వే'లో ఉదయ కిరణ్ అంటాడు. ఈ పంచ్ డైలాగ్‌ను క్లాస్ హీరో అయిన ఉదయ్ కిరణ్ చెప్పినా మాస్ చప్పట్లు కొట్టారు.

పంచ్‌లో కూడా రెండు రకాలున్నాయి. 'కనురెప్ప కిందికి దిగితే వినయం, పైకి లేస్తే విప్లవం', 'పేదోడికీ నోరుంటుంది బాబూ... ఆకలేసినపుడు అమ్మా అంటుంది. కోపమొచ్చినపుడు నీయమ్మ అంటుంది'– ఈ రెండూ పంచ్ డైలాగ్సే. మొదటిది క్లాస్‌ని, రెండోది మాస్‌ని అలరిస్తుంది. రెండోదానికి క్లాస్ నవ్వుకుంటారు. కాకపోతే పైకి ఎబ్బెట్టుగా ఉన్నట్లు ఫీలవుతారు. మొదటిది మాస్‌కి తొందరగా అర్థంకాదు.

కె.వి. రెడ్డిగారి స్కూల్ వచ్చేసింది

గతంలో సినిమాకి ఒక వెర్షన్ రాసిచ్చేస్తే రచయిత పనైపోయేది. మధ్యలో ఏదో ఒకటి రెండు రోజులు రచనలో కూర్చొనేవాళ్ళం. మళ్ళీ నేడు కె.వి. రెడ్డిగారి స్కూల్ వచ్చేసింది. 'స్టాలిన్' కథ అనుకున్న సంవత్సరంన్నర తర్వాత సెట్స్‌పైకి వచ్చింది. నెలల తరబడి కథమీద దర్శకుడు, రచయిత, నిర్మాతలు కూర్చొని సానబెట్టే పాతరోజులు మళ్ళీ వచ్చాయి. హోంవర్క్ చేసుకోవాల్సోస్తోంది. వెంకటేష్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో సురేష్ సంస్థ నిర్మించతలపెట్టిన సినిమా సిట్టింగ్స్ ఇప్పుడు ఐదో నెల నడుస్తోంది. సినిమా ఇంకా సెట్స్‌పైకి వెళ్ళలేదు. ఐదు, పదేళ్ళ క్రితం ఇలాంటి స్థితి లేదు. కథ చెప్పేయడం, గబగబా ఆర్డర్ వేయడం, డైలాగ్స్ రాసేయడం జరిగిపోయేది. తక్కువ బడ్జెట్‌లో సినిమా పూర్తవడమే దీనికారణం. నాలుగు వారాలు సినిమా ఆడితే కొన్నవాడికీ, తీసినవాడికీ లాభం వచ్చేది. కానీ ఇప్పటి పరిస్థితులు అలా లేవు. బడ్జెట్ భారీగా పెరిగిపోయింది. ఎవరూ విశ్వసించని నిజమేమంటే... 'నాదేశం' 21 రోజుల్లో తీశారు. అన్నగారిచ్చిన 19 రోజుల కాల్షీట్లలో ఐదు పాటలు, ఫైట్స్, సన్నివేశాలు తీయగలిగారు.

(ఇంకా వుంది)

ఈ చారలెవరివో...

నేస్తాలూ...కింద నాలుగు జీబ్రాలున్నాయి. కాకపోతే వాటి చారలను మిస్ అయ్యాయి. మధ్యలో వున్న చారలు ఎవరివో గుర్తించండి చూద్దాం.



పది తేడాలు కనిపెట్టండే

చిన్నారులూ! పైన రెండు బొమ్మలున్నాయికదా. అవి చూడ్డానికి అచ్చం ఒకేలా కనిపిస్తాయి. కానీ రెండిట్లోనూ 10 తేడాలున్నాయి. వాటిని కనిపెట్టాల్సింది మాత్రం మీరే. మరి ఆలస్యం ఎందుకర్రా!



గోల్ఫ్ ఆటలో గోల్ చేసిందెవరబ్బా...

రంగులద్దితే పోలా



హేయ్ ఫ్రెండ్స్! ఆర్టిస్టు అంకుల్ కేవలం మీకోసమే ఈ బొమ్మ గీసి పంపారు. కాకపోతే రంగులు వేసే పని మాత్రం మీకు అప్పగించారు. మరి అద్దేస్తే ఒక పనైపోతుందికదా.

రంగురంగుల గుడ్లు

క్రాంతి

క్రిస్మస్ క్రాఫ్ట్

హాయ్ ఫ్రెండ్స్! క్రిస్మస్ పండుగ దగ్గరకొచ్చేస్తోంది కదూ. మీరంతా శాంతాక్లజ్ తీసుకొచ్చే బహుమతుల గురించి ఎదురు చూస్తున్నారా? ఆ తాతగారు మంచు కొండల్లో నుండి వచ్చేటప్పటికి చాలా ఆలస్యమైపోతుంది. అందాకా మీరు కూడా మీ స్నేహితులకు ఎలాంటి బహుమతులు ఇవ్వకుండానే ఉంటారా? లేదు కదూ. అయితే తక్కువ ఖర్చుతో అయిపోయే ఈ రంగు రంగుల గుడ్లను తయారుచేయండి. మీ స్నేహితులకు బహుమతిగా ఇవ్వండి. ఏమంటారు?

రంగురంగుల గుడ్ల తయారీకి ఏమేం కావాలంటే...

ఉడకబెట్టి చల్లార్చిన గుడ్లు, కొన్ని రబ్బరు బ్యాండ్లు, రంగులు.

ఎలా చేయాలంటే... ముందుగా మూడు, నాలుగు రబ్బరు బ్యాండ్లను తీసుకోండి. వాటిని అలాగే గుడ్డు చుట్టూ చుట్టండి. పక్కపక్కనే కాకుండా గుడ్డు పెంకుల మీద ఖాళీలు కనిపించేలా చుట్టండి.

ఇప్పుడు ఓ గిన్నెలో కాసిని నీళ్లు తీసుకొని, అందులో మీకిష్టమొచ్చిన రంగు కలపండి. (బట్టలకు పెట్టుకునే బులుగు, పసుపు, కుంకుమలాంటివైతే ఇంట్లోనే దొరుకుతాయి. కాబట్టి వాటిని ప్రత్యేకంగా కొనాల్సిన అవసరముండదు.) ఈ రంగు నీళ్లల్లో రబ్బరు బ్యాండ్లు చుట్టిన గుడ్లు ఉంచండి. కాసేపటి తర్వాత వాటిని బయటకు తియ్యండి. వాటిని బాగా ఎండబెట్టండి. తర్వాత గుడ్డు మీద వున్న రబ్బరు బ్యాండ్లను తీసెయ్యండి. గుడ్డు మీద రబ్బరు బ్యాండ్ల డిజైన్ బావుంది కదూ.

ఇలాగే ఇంకో రకం గుడ్డను తయారుచేద్దాం. రబ్బరు బ్యాండ్లు చుట్టకుండానే గుడ్లను నేరుగా రంగు నీళ్లల్లో వేయండి. కాసేపయ్యాక బయటకు తీసి ఎండబెట్టండి. ఇప్పుడు దాని మీద క్రేయాన్లతో మీకిష్టమొచ్చిన డిజైన్ వేయండి. చూడ్డానికి చాలా బావుంటుంది.





మరి ఈ వారానికి ఇవి ప్రయత్నించండి. వచ్చే వారం మరో కొత్త క్రిస్మస్ గిఫ్ట్‌తో మళ్లీ కలుద్దాం. సరేనా.

చిన్నారి చిత్రకారులు



టి.గణేష్,
9వ తరగతి,
ఎ.జె.సి.ఆర్ స్కూల్,
రాజాం.

జి.శివ, 10వ తరగతి,
ఎ.పి.యస్.డబ్ల్యు.ఆర్ స్కూల్,
మందలపల్లి (పోస్ట్),
దమ్మపేట (మం), ఖమ్మం జిల్లా.

అట్టమీది కథ

కాకర్లమూడి విజయ్



(నవంబర్ 21 ప్రపంచ టెలివిజన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం)

ప్రపంచంలో ఏ మూల జరుగుతున్న సంఘటనలైనా అదే క్షణాన మారుమూల ప్రాంతాల్లో సైతం తెలుసుకోగలిగే వెసులుబాటు... అదీ కళ్ళకుకట్టినట్లు చూపించగలిగేది టెలివిజన్. కేవలం ఈ లక్షణం వల్లనే ఎవరికి ఎవరూ దూరంకాదనీ, ప్రపంచమే ఒక కుగ్రామమనీ అనుకునే స్థాయికి తెచ్చింది టీవీ.

కానీ ఈ రోజుల్లో టీవీ కేవలం సమాచారాన్ని అందించే సాధనంగానే కాదు.. బహుముఖ పాత్రాభినయం చేస్తోంది. రిమోట్ మీట కదిలితే చాలు రాజకీయాలు, యుద్ధాలు, ఆటలు, పాటలు, నేరాలు, ఘోరాలు, వంటలూ, సినిమాలు, యోగాలు, భక్తిమార్గాలు, కార్టూన్లు, గేమ్ షోలు, పంటలు, పశువులు... ఒకటేమిటి ఎవరి కోరికనైనా ఇట్టే తీర్చే పాతాళభైరవి టీవీ.

బులిపించే బుల్లిపెట్టె

జాన్ లోగీ బెయిర్డ్... ఈ పేరు వినగానే టెలివిజన్ గుర్తుకొచ్చి తీరుతుంది. కానీ 1926 జనవరి 26న మొట్టమొదటిసారి పనిచేసే టెలివిజన్‌ను ప్రజాప్రదర్శనకు ఉంచినపుడు బెయిర్డ్ కూడా తన ఆవిష్కరణ ఎంత ప్రజాదరణ పొందుతుందో ఊహించి వుండడు. ఇప్పుడు 'ప్రజాదరణ' అన్నమాట టెలివిజన్‌పట్ల చాలా చిన్నమాటైపోయింది. టీవీ తెలియనివారూ, దాన్ని వాడనివారూ, దానికి 'బానిస' కానివాళ్ళూ ఎంత తక్కువమందో తెలుసుకోవడం తేలిక.

అయితే అందరికీ టెలివిజన్ ఒకేరకమైన ఉపయోగాలను కలిగించడంలేదు. సాంస్కృతిక కార్యక్రమాలను దేశాలమధ్య సయోధ్య కలిగించడానికి ఉపయోగించుకునేలా టీవీలో ప్రసారంచేస్తే ప్రపంచంలో శాంతి భద్రతలు, ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యంకావచ్చుననే ఆశతో ప్రపంచటీవీ దినోత్సవం జరుపుకున్నా, ప్రపంచంలో చాలామందికి ఆ నిర్దేశించబడిన ఉద్దేశం తప్ప మిగతావన్నీ టీవీవల్ల ఉన్నాయి.

దేశదేశాల్లో జరిగే పరిణామాలన్నిట్నీ నాకు ఆసక్తికరంగా అందిస్తుంది' అన్నారు నాగేశ్వరరావు టీవీగురించి. ఆయనకు రాజకీయాలంటే ఇష్టంగనుక ఆ నేపథ్యంలో వార్తా కార్యక్రమాలే ఇష్టం.

'ఇంటి పనులన్నీ ఐపోయాక సీరియళ్ళు చూస్తాం' అనే అభిప్రాయం అధికశాతం మహిళలది. అటువంటి సీరియళ్ళు మీపై వ్యక్తిగతంగా ప్రభావం చూపవా అనే ప్రశ్నకు సమాధానం – 'చూసినంతసేపే గానీ అవే ఆలోచిస్తూ వుండంకదా. సినిమా అయినా అంతే. కాకపోతే టీవీవల్ల ఇంట్లోనే కాలక్షేపం చేసే వీలుంది' అని.

అయితే టీవీలు కేవలం కాలక్షేపానికేనా అంటే కొంతవరకూ అంతేనన్నాడు సురేష్. సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమౌతున్న సురేష్‌కి టీవీ వేరే ప్రయోజనాలను ఇస్తుంది. 'నాకు కావలసిన తాజా సమాచారం, విశ్లేషణ ఒక అంశంపై భిన్న అభిప్రాయాలూ టీవీ ఇస్తుంది. అలాగని కేవలం టీవీపైనే ఆధారపడను. వార్తాపత్రికలూ పుస్తకాలూ కూడా ముఖ్యం' అన్నాడతను.

ప్రపంచ టెలివిజన్ దినోత్సవం

మొట్టమొదటి ప్రపంచ టెలివిజన్ ఫోరం 1996 నవంబరు 21న నిర్వహించ బడింది. ఆ సభలో మీడియా నిర్వాహకులు కలిసి ప్రపంచంలో పెరిగిన టెలివిజన్ ప్రాముఖ్యత గురించి చర్చించారు. ఈ సభ దృష్ట్యా యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ 99వ ప్లీనరీ సమావేశం (1996, డిసెంబరు 17) లో నవంబరు 21వ తేదీని ప్రపంచ టీవీ దినోత్సవంగా పాటించాలని నిర్ణయించింది. దీని ఉద్దేశం - దేశాలమధ్య సాంస్కృతిక కార్యక్రమాల పరస్పర మార్పిడిద్వారా శాంతిభద్రతలు, ఆర్థిక, సామాజిక అభివృద్ధి అంశాలపై దృష్టి నిలపాలి.



ప్రజలకు వివిధ ప్రయోజనకర అంశాలపై అవగాహన కలిగించి సమాచార వ్యాప్తికి తోడ్పడటం ఇప్పుడు రెండవస్థాయి ప్రాముఖ్యత అయిపోయింది. టీవీని చూసేవారు కేవలం వినోదంకోసమే దాన్ని ఆశ్రయిస్తున్నారు. పైగా ఆ వినోదం కూడా సినిమా సంబంధిత కార్యక్రమాలే అవడం విశేషం.

టీవీ వచ్చిన కొత్తలో 'ఇక సినిమా పరిశ్రమ అయిపోయినట్టే' అనుకున్నా అది వట్టి భయమేనని తేలిపోయింది. సినిమాలపట్ల భారతదేశంలో ఉన్న 'పిచ్చి' ఏమాత్రం తగ్గలేదని నిరూపణ అయింది. చూసిన సినిమా పదేపదే టీవీలలో వేస్తున్నా ప్రేక్షకుల ఆదరణ తగ్గలేదు. పైగా అసలు రాబోయే సినిమాలకు అద్భుతమైన ప్రచార మాధ్యమంగా టీవీ మారిపోయింది.

'టీవీలో సినిమా వస్తే పర్లేదు. కానీ పెద్ద స్క్రీన్‌పై చూడటం వేరే అనుభూతి కదా. అందుకని టీవీ ఉన్నా థియేటర్లో సినిమాలు తగ్గవు' అన్నారు శ్యామసుందర్. 'కాకపోతే ఇప్పుడు థియేటర్ టికెట్ ధరలు అందుబాటులో లేవుగనుక చాలామంది టీవీనే బెటర్' అంటున్నారు.

టీవీలో ఎక్కువశాతం సినీ సంబంధిత కార్యక్రమాలే వస్తున్నమాట నిజమైనప్పటికీ క్విజ్‌లూ, గేమ్‌షోలూ, టాలెంట్‌ను ప్రదర్శించే పాటలు, డాన్సుల ప్రోగ్రాంలూ... కార్టూన్లు ఎన్నిలేవు? 'మా పిల్లలు స్కూలునుండి వచ్చీరాగానే కార్టూన్ నెట్‌వర్క్ చూస్తూ కూర్చుంటారు' అన్నారు సుశీల. 'మా ఇంట్లో ఉదయం పదకొండు గంటలనుండీ రాత్రి పదకొండువరకూ టీవీ నడుస్తూనే వుంటుంది' అన్నారావిడ కాస్త నవ్వుతూ.

ఒక సర్వే ప్రకారం ప్రతి మనిషీ సగటున నాలుగ్గంటలపాటు టీవీ చూస్తాడట. దాదాపు 85 శాతం పిల్లలు (2-7 సంవత్సరాల మధ్య) టీవీ ముందు కనీసం రెండుగంటలు గడుపుతారట. 60 శాతం పిల్లలు తమకు బయట ఆడుకోవడం కన్నా ఇంట్లో టీవీ చూడటమే ఇష్టమని చెప్పారు. వారంలో పది గంటలకు పైగా టీవీ చూస్తోన్నవారిలో చదువులో క్షీణత కనిపించింది.

టీవీ పిల్లలపైనే కాదు పెద్దలపైన కూడా తన ప్రభావాన్ని చూపుతుంది. కనీసం చెయ్యి కూడా కదపకుండా కూర్చున్న చోటే తిని, తాగుతూ కళ్ళు టీవీకి, ఒళ్ళు సోఫాకీ అప్పగించిన వాళ్ళలో స్థూలకాయత ఎక్కువౌతోన్నట్లు తేలింది. ఆరు-పదకొండు సంవత్సరాల మధ్య పిల్లల్లో 6.5 శాతం మందికి ఒబేసిటీ వచ్చింది. 14.5 శాతం పెద్దల్లో ఒబేసిటీ వచ్చింది. 7.9 శాతం పిల్లలకు కంటిచూపు దెబ్బతిని కళ్ళద్దాల వాడకం అవసరమైంది. 11 శాతం పెద్దలకు కంటి సమస్యలు వచ్చాయి.

అయితే పిల్లలపై టీవీ కార్యక్రమాల దుష్ప్రభావాలు ఎక్కువ. వారిలో అనుకరించే అలవాటువల్ల 'హీరోయిజం', 'యాక్షన్' వంటివి బాగా అలవాటవుతాయి. మనదేశంలో వివరాలు తెలీవుగానీ అమెరికాలో 18 ఏళ్ళలోపు పిల్లవాడు సగటున రెండు లక్షల హింసాత్మక దృశ్యాలను చూసి వుంటాడని లెక్కవేశారు. బహుశా మన టీవీలు అంతకంటే ఎక్కువే చూపుతాయేమో.

'ఈమధ్య ప్రమాదాలు జరిగినా, హత్యలు, ఆత్మహత్యలు, ఎన్‌కౌంటర్లు జరిగినా మరీ బీభత్సంగా టీవీల్లో చూపిస్తున్నారు. జరిగింది వాస్తవమే అయినా అంత ఘోరంగా చూపించవలసిన అవసరం లేదు. బాధ్యత కలిగిన పేరున్న న్యూస్‌పేపర్లు కూడా ఇటువంటి దారినే ఆశ్రయిస్తున్నాయి. ఇది మంచిదికాదు' అని వాపోయారు శ్రీ నాగేశ్వరరావు.

'అది నిజం. ఎవరో వ్యక్తిగత జీవితాలను రహస్యంగా చిత్రీకరించి మొత్తం ప్రజలకు చూపించవలసిన అగత్యం ఎందుకు? అహ్మదాబాద్‌లో ఫలానావాడు అతడి గాళ్‌ఫ్రెండును ఏంచేస్తే మట్టుకు ఆదిలాబాద్‌లో వున్న మనకెందుకు? దానివలన సమాజానికి ఏమైనా లాభముందా? అర్థం పర్థంలేని ఆకతాయి పనులు చేసి టేకిటీజీ, బక్రా అంటూ బలవంతపు నవ్వు పుట్టించడానికి పుట్టే కార్యక్రమాలవల్ల వాళ్ళు సాధించేదేమిటి? సాహసం పేరుతో పురుగులను తినడం, పాముల మధ్య పడుకోవడం వంటి ప్రోగ్రాంలు ఎందుకు ఉపయోగపడతాయి? బాధ్యత లేనివాళ్ళూ, డబ్బెక్కువై టీవీ ఛానళ్ళు పెట్టినవాళ్ళూ, సృజనాత్మకత లోపించిన వాళ్ళు ఈ మీడియాలోకి వస్తే ఇలాగే వుంటుంది' అని ఆవేశంగా చెప్పారు సురేష్.

అతని ఆవేశంలో అర్థముంది. తాత్కాలిక 'సెన్సేషన్' కోసం తమ ఛానళ్ళపట్ల ప్రేక్షకుల ఆదరణ పెంచుకోవడం కోసం చాలా ఛానళ్ళు దిగజారుదు తనాన్ని చూపుతున్నాయి. ఇటీవల ఒకతను బిల్డింగ్‌పైనుండి దూకి ఆత్మహత్య చేసుకోవడాన్ని తెలుగు ఛానళ్ళు పదేపదే చూపించాయి. 'పిల్లలతోబాటు చూసే సమయంలో అటువంటి అభ్యంతరకరమైన అంశాలు వస్తే వారిని చూడకుండా చేయడం కష్టమౌతుంది' అన్నారు శ్రీమతి సుశీల. '...పైగా వార్తల్లో కూడా ఇటువంటివి చూపిస్తే ఇక మిగతా



ప్రపంచంలో టీవీ

ఆధునిక టెలివిజన్ మూలాలు చాలా లోతైనవి. వాటి ప్రారంభం 1873లో సెలీనియంకి ఫొటో కండక్టివిటీ వుందని విల్లోబైస్మిత్ కనుగొన్నపుడే జరిగింది. పాల్ నిప్‌కొవ్ 1884లో స్కానింగ్ డిస్క్ కనుగొన్నాడు. జాన్ బెయిర్డ్ 1926లో 'బ్లాక్ అండ్ వైట్' టీవీని తొలిసారి ప్రదర్శించాడు. ఆయనే 1928 జూలై 3న మొట్టమొదటి కలర్‌టీవీ రూపొందించాడు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందే అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, ఫ్రాన్స్, సోవియట్ యూనియన్లలో క్రమంగా టీవీ ప్రసారాలు జరిగేవి. కాస్త ఆధునికత సంతరించుకున్న (240గీతలు) టీవీ ప్రసారాలు ఇంగ్లండులో 1936లో జరిగాయి. అవే అతి త్వరలో 405 గీతలుగా మెరుగయ్యాయి. టీవీ నెట్‌వర్క్ 1946లో అమెరికాలో ప్రారంభమైంది. 1950లలో టీవీ అమెరికన్ల ఇళ్ళలో సాధారణమైంది.



కార్యక్రమాలు ఇంకెంత ఘోరమైన విషయాలనైనా చూపించగలవు కదా. అందుకే కార్టూన్ కథలే. వీటన్నింటికంటే బెస్ట్. వాటిలో హింస తక్కువ' అన్నారావిడ తన మాటలను పొడిగిస్తూ.

'ఎక్కడో విదేశీ ఛానళ్ళు మన సంస్కృతిని కలుషితం చేస్తాయని, చేస్తున్నాయిని నిషేధం విధించేకన్నా ముందు మన సొంత ఛానళ్ళు ఏం చేస్తున్నాయో చూడాలి' అన్నారు సురేష్. విదేశీ ఛానళ్ళ ఫలితంగా పాశ్చాత్య సంస్కృతి మన యువతపై ప్రభావం చూపించడంలో విశేషమేమీ లేదని సురేష్ వాదన. 'ఎప్పటికైనా అటువంటి మార్పు అవసరమే. ఆ మార్పును టీవీ ఇంకాస్త త్వరగా వచ్చేలా చేసిందంతే' అన్నారతను.

'బయటి సంస్కృతి మాట అటుంచండి. అత్తాకోడళ్ళంటే కుట్రలూ కుతంత్రాలూ చేయాలి... ఆఫీసులో పనిచేసే మహిళలకు వివాహేతర సంబంధాలుండాలి... నాగుపాములకు పూజలు చేస్తే వరాలు దొరుకుతాయి... అమావాస్య రాత్రులలో తెల్లచీర కట్టుకున్న దెయ్యాలు తిరుగుతాయి... వంటి భావజాలాన్ని పదేపదే ప్రజల్లోకి ఇంజక్ట్ చేస్తోంది మన టీవీ సంస్కృతే... ఇది నిజం కాదా? ఇందులో ఏమైనా అతిశయోక్తి వుందా?' అని ప్రశ్నిస్తున్నారు సురేష్.

ఇంట్లోకి రంగుబొమ్మల పెట్టె వచ్చిందంటే దానిముందు కళ్ళూ, నోళ్ళూ తెరిచిచూశాం. అది ముందుముందు పాడిపంటలు, విద్యావంటలూ లాంటి కార్యక్రమాలే చూపించింది. మెల్లగా దాని పరిధి పెరిగింది. ప్రపంచాన్ని మనముందు సాక్షాత్కరింపచేసింది. ఆ అనుభూతిని పూర్తిగా అనుభవించకముందే అది మన స్వంత జీవితాల్లోకి ప్రవేశించింది. మనపై మనకే లేని అనుమానాలను కలిగించింది. మూఢవిశ్వాసాలను అడ్డుకోవడం పోయి కొత్తవి కలిగిస్తూ, పాతవాటిని బలపరిచింది. సినిమా విషయాలకు విజ్ఞాన స్థాయిని కల్పిస్తూ క్విజ్‌లు నడిపింది. నేరస్తులను హీరోలుగా చేసింది.

ప్రపంచాన్ని మీ ముందుకు తెస్తానన్న టీవీ అలాగే చేసింది. అందుకే మనం ఎక్కడికీ కదలకుండా మొద్దుబారిపోయాం. సరిగ్గా, జ్ఞానయుతంగా వాడుకుంటే టీవీ అద్భుతం. అలా కానిపక్షంలో అవయవాలను, చక్షువులను, మేధను మొద్దుబార్చే ఆయుధం. మనల్ని నైతికంగా దిగజార్చే మారణాయుధం. ✤

టీవీ భారతం

అమెరికన్లు టీవీ చూడటం అలవాటు చేసుకున్న దశాబ్దానికి గానీ టీవీ మనదేశంలోకి రాలేదు. 1959లో, ఢిల్లీలో విద్యాంశాలతో పరీక్షా ప్రసారాలు ప్రారంభమయ్యాయి. మిగతా ప్రోగ్రాములు మొదలయ్యేసరికి 1980 వచ్చింది. అదీ అంత సులభంగా జరగలేదు. ఈ టీవీ టెక్నాలజీనే వ్యతిరేకించే సాంప్రదాయవాదులు అసలు టీవీ లేకపోతే దేశానికొచ్చే నష్టమేదీ లేదన్నారు. 1955లో ప్రింట్ మీడియాలో విదేశీ పెట్టుబడుల నిషేధాన్ని కాబినెట్ ఆమోదించి దాదాపు 45 సంవత్సరాలు దాన్ని పాటించింది. 1977లో లైసెన్సులు కలిగిన (అప్పట్లో టీవీ కొంటే లైసెన్సు కూడా పొందవలసివచ్చేది, రేడియోలాగా) టీవీలు భారతదేశంలో 6,76,615 వుండేవి.

అప్పట్లో ఉన్న ఏకైక ప్రసార సంస్థ దూరదర్శన్ 1982, ఆసియా క్రీడల సందర్భంగా 'కలర్' ప్రసారాలు చేపట్టింది. క్రమక్రమంగా దేశవ్యాప్తంగా ట్రాన్స్‌మిటర్లను స్థాపించింది. కానీ ప్రైవేటు సంస్థలకు మాత్రం ప్రసారాల హక్కులు ఇవ్వలేదు.

తొంభయ్యవ దశకంలో సి.ఎన్.ఎన్, స్టార్ టీవీ వంటి విదేశీ ప్రసారకులు అడుగుపెట్టారు. కొద్దికాలం తర్వాత స్థానిక జీ, సన్ వంటివి ప్రవేశించాయి. అప్పటివరకూ దూరదర్శన్ (డిడి) విద్య, సామాజిక, ఆర్థిక సంబంధ కార్యక్రమాలనే ప్రసారం చేసేది. వినోద కార్యక్రమాలు బహు తక్కువ. 'హమ్‌లోగ్' (1984), 'రామాయణ్' (1987-88), 'మహాభారత్' (1988-89) వంటి సీరియళ్ళు ప్రజలను టీవీవైపు ఆకట్టుకోవడమే గాక ఆసాంతం కట్టిపడేశాయి. ఆ రోజుల్లోనే 'చిత్రహార్' అనే సినీగీతాల కార్యక్రమం కూడా బాగా ప్రాచుర్యం పొందింది.

గల్ఫ్ యుద్ధాన్ని టీవీలో చూడటం సంభవమే అని గుర్తించిన వెంటనే 'డిష్' యాంటెనాలు కొనుక్కున్నారు. ఇంకొందరు ఏకంగా ఇద్దరు ముగ్గురికి వైర్లు లాగి కనెక్షన్లు తీసుకున్నారు. క్రమంగా కేబుల్ టీవీ పెరిగిపోయింది. 1991కి ముందు రెండు ఛానళ్ళు చూసిన ప్రజలు 1996 కల్లా 50 ;ఛానళ్ళు చూడగలిగారు. ఈరోజు 100కి పైగా ఛానళ్ళు అన్నిరకాల వాళ్ళకూ వారివారి అవసరాలు తీరుస్తున్నాయి. టీవీ కనిపెట్టిన 30 సంవత్సరాల తర్వాత అది మనదేశంలో ప్రవేశించినంత మాత్రాన మనం ఏమీ వెనకబడిపోలేదు. మన తర్వాత దాదాపు 70 దేశాలు 1960 నుండి 1999 వరకూ టీవీ వాడడం ప్రారంభించాయి. 1928లో అమెరికాలో టీవీ వాడకం మొదలుకాగా భూటాన్‌లో 1999లో ప్రారంభమైంది.

ఆరోగ్యం

మధుమేహ రోగులకు ఇన్‌ఫ్లుయెంజా



డా॥ సోమనాథ్
ఇమేజ్ హాస్పిటల్, హైదరాబాద్

మధుమేహ రోగులకు ఇన్‌ఫ్లుయెంజా ఎంతో ప్రమాదకరం. దానివల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు ఆసుపత్రిపాలయ్యేందుకు, ఒక్కోసారి మరణించేందుకు కూడా అవకాశం ఉంది. మధుమేహ రోగులను ఇన్‌ఫ్లుయెంజా నుంచి కాపాడేందుకు వారికి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించడం ఎంతో సురక్షితం. ఇన్‌ఫ్లుయెంజా వ్యాధినిరోధక టీకాలు తీసుకున్న మధుమేహ రోగుల శాతం ఎంతో తక్కువ.



ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, 2004లో, ప్రపంచవ్యాప్తంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య 150 మిలియన్లు. ఈ వ్యాధికి గురయ్యేవారి సంఖ్య ఏటేటా బాగా పెరుగుతూనే ఉంది. ఒక అంచనా ప్రకారం 2025 నాటికి ఈ సంఖ్య రెట్టింపు కానుంది. మధుమేహం అనేది ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరికైనా వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, అభివృద్ధి చెందిన దేశాల్లోనివారికి వచ్చే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుంది.

ఇన్‌ఫ్లుయెంజావల్ల తీవ్రసమస్యలను ఎదుర్కొనే అవకాశం అధికం.

ప్రపంచవ్యాప్తంగా భయోత్పాతాలు సృష్టించే వ్యాధుల్లో ఇన్‌ఫ్లుయెంజా ఒకటి. వ్యాధి నిరోధక శక్తిని బాగా దెబ్బతీసేదిగా ఇది గుర్తింపు పొందింది. వృద్ధులలో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఇన్‌ఫ్లుయెంజా నుంచి కాపాడే ఉద్దేశంతో వారికి వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలనే అంశంపై గత దశాబ్ద కాలంగా ప్రపంచవ్యాప్తంగా ఎన్నెన్నో ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

అంటువ్యాధులకు మధుమేహరోగులు మరింత త్వరగా గురవుతారు. మధుమేహం లేని ఇతరులతో పోలిస్తే మధుమేహ రోగులు న్యుమోనియా లేదా ఇన్‌ఫ్లుయెంజా వంటి అనారోగ్యాలతో మృతిచెందే అవకాశం మూడు రెట్లు అధికం. మధుమేహ వ్యాధిగ్రస్తులు మృతి చెందేందుకు దోహదపడే ఆరు ప్రధాన కారణాల్లో ఇదొకటి. ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి ప్రబలే సమయంలో, మధుమేహం లేనివారితో పోలిస్తే, మధుమేహ రోగులు ఆసుపత్రిపాలయ్యే అవకాశాలు ఆరు రెట్లు ఎక్కువగా ఉంటాయి. ఆ సమయంలో, వారు న్యుమోనియా లేదా కెటోఅసిడోసిస్ (కణజాలంలో, శరీర ద్రవాల్లో ఆమ్లము, కీటోన్లు అధికమవడం) వంటి వాటితో చనిపోయే అవకాశం అధికమవుతుంది.

ఇన్‌ఫ్లుయెంజా నుంచి తప్పించుకోడానికి సొంత చికిత్సలు చేసుకునేవారు, మందుల దుకాణాల్ని ఆశ్రయించేవారు, డాక్టర్ల వద్దకు వెళ్ళేవారు... ఇలా ఎన్నో రకాల వారుంటారు. కొంతమందిలో ఇన్‌ఫ్లుయెంజా హృదయ సంబంధిత సమస్యలను కూడా కలిగిస్తుంది.

న్యుమోనియా వంటి సమస్యలు తలెత్తడానికి కారణం ఊపిరితిత్తుల ఉపరితల భాగంలో రక్షణ ప్రొటీన్ల ప్రభావాన్ని తటస్థీకరించడం కావచ్చు.

వ్యాధినిరోధక టీకాల ద్వారా ప్రభావపూరిత రక్షణ

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇమ్యునైజేషన్ ప్రాక్టీసెస్ పైగల సలహా సంఘం (అమెరికా), మరెన్నో జాతీయ ఆరోగ్య సంస్థలు కూడా, ఇన్‌ఫ్లుయెంజా సీజన్ రాకముందే, అది తీవ్ర ప్రభావాలు చూపించేటువంటి అవకాశం గల వర్గాలకు టీకా ఇప్పించడం మంచిదని సిఫారసు చేశాయి. ఇన్‌ఫ్లుయెంజా ప్రభావాన్ని తగ్గించడానికి అత్యంత ప్రభావపూరిత చర్య వ్యాధినిరోధక టీకా ఇప్పించడమే.

ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ ఎంతో సురక్షితం. పెద్దవారైన మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఈ టీకా ఇప్పించేందుకు సంబంధించి ఎలాంటి వివాదాలూ లేవు. ఈ రోగులకు టీకా ఇవ్వడం, ఊహించని ప్రతికూల ఫలితాలను వేటినీ క్లినికల్ ట్రయల్స్ సందర్భంగా ఇవ్వలేదు. అంతేగాకుండా, ఈ టీకా ఇవ్వడమనేది, న్యుమోనియా, ఇన్‌ఫ్లుయెంజా ఇంకా కెటోయాసిడోసిస్ వంటి వాటివల్ల ఆసుపత్రులపాలయ్యే అవకాశాలను 80 శాతం దాకా తగ్గిస్తుంది కూడా. ✤



కథ

సరిదే నాగేశ్వరరావు

పావలా ఇవ్వరూ....!

ఆఫీసుకు సెలవు పెట్టానన్నమాటేగానీ ఎక్కడా తీరిక లేదు. అంతూదరీ లేకుండా ఏవేవో పనులు.. బ్యాంకులో పని ముగించుకుని ఇంటి దారిపట్టాను.

"ఏవండోయ్.. ఈరోజైనా చంటాడి బర్త్ సర్టిఫికేట్ మర్చిపోకుండా తీసుకురండి. అదిగానీ లేకపోతే వాడిని కాన్వెంట్‌లో జాయిన్ చేయడం కుదర్దు" శ్రీమతి అరిచి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి.

దీంతో మున్సిపల్ ఆఫీసు వైపు అడుగులు వేశాను.

'ఏమిటో కాళ్లు తడవకుండా సముద్రం దాటొచ్చుగానీ సిబ్బంది చేతులు తడపకుండా మున్సిపాల్టీల్లో పని చేయించుకోలేం" చంటాడి బర్త్ సర్టిఫికేట్ కోసం నెల రోజుల క్రితం దరఖాస్తు పెట్టాను. ఫలితం లేదు. ఎన్ని చట్టాలు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగుల్లో మార్పు కనిపించడం లేదు. చివరికి రెండు రోజుల క్రితం క్లర్క్ చేతిలో వంద రూపాయలు పెడితే ఈరోజు రమ్మన్నాడు.

ఆలోచనలో పడి మున్సిపల్ ఆఫీసుకొచ్చేశాను. క్లర్క్ నన్ను చూడగానే ముఖమంతా నవ్వుచేసుకున్నాడు. వంద మహత్యం మరి.

"జస్ట్ ఐదు నిమిషాలు సార్... మీ సర్టిఫికేట్ కమిషనర్ సంతకానికి వెళ్లింది. కాస్తలా కూర్చున్నారంటే ఇచ్చేస్తాను" చెప్పాడు.

సరే చేసేదేమీ లేదు. అవసరం తనది గనుక వెయిట్ చేయాల్సిందే. అక్కడ బైరాయించేబదులు అలా ఆఫీసు కారిడార్‌లోకి వెళ్లాను. అక్కడ ఒక దృశ్యం నాకు ఆసక్తి కలిగించింది. ఓ వృద్ధురాలు అడుక్కుంటోంది...

తైల సంస్కారం లేని జుత్తు.. ఒక చేతిలో స్టీలు గిన్నె.. మరో చేతిలో కర్ర... చిరుగుల చీర... అయినా ముఖంలో ఏదో తెలియని సంస్కారం లీలగా తొంగి చూస్తోంది..

అయితే ఇవికాదు నాలో ఆసక్తిని పెంచింది. ఆమె ఎవరిని యాచించినా "పావలా ఇవ్వరూ..." అనే అడుగుతోంది. ఒకరిద్దరిచ్చారు. మరికొందరు లేదన్నారు. అదీ చాలా గౌరవంగా చెబుతున్నారు. మరొకాయన చిల్లర లేదంటూ రూపాయి ఇవ్వబోయాడు. చిత్రంగా ఆమె ఆ నాణెం తీసుకోలేదు. పావలాయే కావాలంది.

"మీతో చాలా చిక్కొచ్చింది... మేడమ్‌గారూ... ఇప్పుడు పావలాలు ఎక్కడ దొరుకుతాయి? అయినా రూపాయికే విలువ లేని ఈ రోజుల్లో ఇంకా పావలా అంటారేంటి..." అంటూ విసుక్కున్నాడాయన.

అతని మాటల్ని ఎంతమాత్రం పట్టించుకోని వృద్ధురాలు "పావలా ఇవ్వరూ..." అని మరోసారి అడిగిందేగానీ రూపాయి మాత్రం తీసుకోలేదు.

సహజంగానే ఆ సంఘటన నాలో క్యూరియాసిటీని పెంచింది. ఆమె గురించి పూర్తిగా తెలుసుకుంటేనే గానీ నాకు నిద్రపట్టదని అర్థమైపోయింది. అదే సమయంలో టీ తాగడానికి వచ్చిన క్లర్క్ కనిపించాడు.

"సార్ మీ సర్టిఫికేట్ మీద సంతకమై పోయింది. తీసికెళ్తారా..?' అడిగాడతను.

"అది సరేగానీ ఆమె ఎవరూ? పావలాయే అడుగుతోందేమిటి? వేరేవాళ్ళు అంతకంటే ఇవ్వబోయినా తీసుకోదేంటి? పైగా అందరూ ఆమెతో అంత గౌరవంగా మాట్లాడుతున్నారు" అంటూ అనేక సందేహాలు బయటపెట్టి చెప్పకపోతే వదలను అన్నట్టు అడిగాను.

"అదో పెద్ద కథ సార్..." అనేసి టీ చప్పరిస్తూ అతను ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోయాడు.

❋ ❋ ❋

ఆ వృద్ధురాలి పేరు గాయత్రి. తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. ఊరు పెద బ్రహ్మదేవం. గాయత్రి పేరుకు తగ్గట్టే చదువుల తల్లి. హిందీలో ఎం.ఏ చేసింది. పిఠాపురం మున్సిపల్ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా ఉద్యోగంలో చేరింది.

ఆమెకు ఆర్ అండ్ బిలో పనిచేస్తోన్న రామారావుతో తల్లిదండ్రులు పెళ్లి జరిపించారు. రామారావు అందగాడు. ఇద్దరి జీతంతో మొదట్లో వారి సంసారం బాగానే సాగింది. కాల గమనంలో రెండేళ్లు గడిచిపోయాయి. వారికి పిల్లలు పుట్టలేదు. దీంతో రామారావు ప్రవర్తనలో మార్పు రావడం మొదలైంది. పిల్లలు పుట్టకపోవడానికి గాయత్రి ఒక్కదానిదే తప్పన్నట్టు ప్రవర్తించేవాడు. కనిపించిన ప్రతి డాక్టర్ చేతా ఆమెను టెస్ట్ చేయించేవాడు. తాను మాత్రం పరీక్ష చేయించుకునేవాడు కాదు. కొంతకాలం అయ్యేసరికి ఇంటికి తాగి రావడం ప్రారంభించాడు. పిల్లలు లేరనే బాధతో తాగుతున్నాడని గాయత్రి సరిపెట్టుకుంది. ఇంకొన్ని రోజులకు రామారావు ప్రతి విషయానికీ చిరాకుపడిపోతూ చీటికిమాటికి గాయత్రిని కొట్టడం ప్రారంభించాడు. సంసారం వీధిలో పడేట్టు గోలగోలగా అరిచేవాడు.

"నీవల్లే నా వంశం అంతరిస్తోంది. నువ్వు చస్తే మరో పెళ్లి చేసుకుని వంశం నిలుపుకుంటాను" అనడం సాగించాడు.

స్వతహాగా శాంతమూర్తి అయిన గాయత్రి అతను పెట్టే బాధలు మౌనంగానే భరించింది. గాయత్రి జీతం డబ్బంతా తీసుకుని రామారావు తాగి తందనాలాడేవాడు. ఉద్యోగానికి వెళ్లేవాడు కాదు.

కొన్ని రోజులకు రామారావు ఇంటికి రావడం మానేశాడు. కనీసం ఎక్కడికెళ్లాడో, ఏమయ్యాడో కూడా గాయత్రికి తెలియలేదు. అతనే తిరిగొస్తాడని కొన్నాళ్ళు మనసుకు సర్దిచెప్పుకుని బాధను నిగ్రహించుకుంది. కానీ ఎన్ని రోజులైనా





అతను తిరిగి రాలేదు.

తర్వాతెప్పుడో తెలిసింది... రామారావు రాజమండ్రి బదిలీ చేయించుకున్నాడని, వేరే ఆమెతో కలిసుంటున్నాడని. విషయం తెలియగానే గాయత్రి పిడుగుపాటుకు గురైంది. సంప్రదాయమైన కుటుంబంలో పుట్టిన ఆమె ఈ పరిస్థితిని జీర్ణించుకోలేకపోయింది. తీవ్ర మనస్తాపానికి గురైంది. స్కూలుకు వెళ్ళకపోవడమే కాదు అసలు ఇంటినుంచి బయటికే రావడం మానేసింది. తోటి ఉపాధ్యాయులు చాలాకాలం ఆమెకు సహకరిస్తూ వచ్చారు. ఆమె స్కూల్‌కు గైర్ హాజరైనా ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్ళలేదు. కొంతకాలానికి గాయత్రి స్కూల్‌కు యథాతథంగా వచ్చేది. అయినా మునుపటిలా పాఠాలు చెప్పేది కాదు. అన్యమనస్కంగా ఉండేది. అంతకుముందు అల్లరి చేసినా పొరపాటున కూడా చేయిచేసుకోని గాయత్రి కొన్నిసార్లు కారణం లేకుండానే పిల్లలను కొట్టేది. అందరూ తనకు అన్యాయం చేస్తున్నారనే భావంతో ఉండేది. తోటి ఉపాధ్యాయులతో గొడవలు పడేది. అందరిమీదా కమిషనర్‌కు ఫిర్యాదులు పంపేది. ఎంతో పొందికతో.. శాంతమూర్తిలా ఉండే గాయత్రిలో వచ్చిన ఈ మార్పు సహోద్యోగుల్లో ఆశ్చర్యం కలిగించింది. వాళ్ళకు కోపం రావడానికి బదులు సానుభూతే కలిగింది.

రానురానూ గాయత్రి స్కూల్‌కు వెళ్లడం మానేసింది. కనీసం నెలసరి జీతం తీసుకోడానికి కూడా ఆవిడు వెళ్ళేది కాదు. తోటి ఉపాధ్యాయులు సానుభూతితో ఇంటికి వెళ్లి పరామర్శించబోయినా వారితో గాయత్రి సరిగ్గా మాట్లాడేది కాదు. పైగా వారిమీద కమిషనర్‌కు కంప్లైంట్ చేసేది.

అందరూ తనను మోసం చేస్తున్నారనే ఆత్మనూన్యతా భావం గాయత్రిలో పెరిగిపోయింది. దీంతో ఎవరూ ఆమె ఇంటివైపు వెళ్లేవారు కాదు. భర్త చేసిన అప్పులతో ఇంట్లో సామానంతా అప్పుల వాళ్లు పట్టుకుపోయారు. ఆదాయం లేక వచ్చిన జీతం తీసుకోవాలనే ధ్యాసలేక గాయత్రి వీధిన పడింది.

కొన్ని రోజులకు గాయత్రికి మతి స్థిమితం తప్పిందని ఊళ్లో జనం నిర్ధారించుకున్నారు. ఆమె తల్లిదండ్రులు కొన్నాళ్ల క్రితమే చనిపోవడం, తోబుట్టువులు ఎవరూ లేకపోవడం, అయినవాళ్లు పట్టించుకోకపోవడం గాయత్రిని వీధులు పట్టి తిరిగేలా చేశాయి. పైగా గాయత్రి ఎవరినీ నమ్మేది కాదు. అలాగే పిచ్చిదానిలానే తిరిగేది.

పాఠశాలకు రాకపోయేసరికి ఆమె ఉద్యోగం పోయింది. అదంతా గ్రహించేదశలో లేదు గాయత్రి. ఆమెకు ప్రభుత్వం నుంచి రావల్సిన మొత్తం అధికారులు లెక్కగట్టారు. అది లక్షల్లోనే తేలింది. కాని ఆ మొత్తం తీసుకోవాలనే శ్రద్ధ ఆమెకు లేదు. మతి స్థిమితం లేని ఆమెకు డబ్బులిచ్చే రిస్కు అధికారులు తీసుకోలేకపోయారు. దీంతో లక్షలాది రూపాయలు ఉన్నా మతి స్థిమితం లేని గాయత్రి వీధిలో భిక్షమెత్తుకొంటోంది.

ఆమె గురించి తెల్సినవాళ్లు ముందుకొచ్చి సహాయం చేయాలనుకున్నా ఆమె స్వీకరించదు. పావలాయే కావాలంటుంది. పావలాకూ, గాయత్రికీ వున్న బంధమేమిటో ఎవరికీ తెలీదు.

❋ ❋ ❋

అతడలా గాయత్రి కథ చెప్పగా నా మనసు బరువెక్కింది. ఆమెకు సహాయం చేయాలనిపించింది.

క్లర్క్‌తో ఇప్పుడే వస్తానని చెప్పి కమిషనర్‌ను కలిశాను. గాయత్రి గురించి ప్రస్తావించాను. 'ఏమైనా సాయం చేయొచ్చుకదా' అని ప్రాధేయపడ్డాను.

ఆయన చెప్పిన విషయం వినేసరికి నా బుర్ర పనిచేయలేదు. గాయత్రికి రావల్సిన మొత్తం లెక్కకట్టగా 8 లక్షల రూపాయలని తేలింది. అయితే ఆ డబ్బులు ఆవిడకు అందజేయాలంటే ముందు గాయత్రి అప్లికేషన్ పెట్టాలి. సంతకం పెట్టి డబ్బులు తీసుకోవాలి. ఒకవేళ గాయత్రి అందుకు సిద్ధపడినా ఆమె మానసిక స్థితి రీత్యా డాక్టర్ సర్టిఫికేట్ లేనిదే ఆమెకు డబ్బులిచ్చే రిస్కు తాను తీసుకోలేనని కమిషనర్ నిస్సహాయత వ్యక్తం చేశారు. ఆవిడకు వారసులెవరూ లేనందున తానేమీ చేయలేనని ఆయన తేల్చిచెప్పారు. చేసేదేమీ లేక అక్కడినుంచి బయటికొచ్చాను.

ఒక మగవాడి మూర్ఖత్వం నిండు జీవితాన్ని రోడ్ల పాల్జేసింది. ఆలోచనలో చంటిగాడి బర్త్ సర్టిఫికేట్ విషయం మర్చిపోయి నా బైక్ పార్క్‌చేసిన వైపు అడుగులేస్తున్నాను. వెనుక నుంచి క్లర్క్ పిలుస్తోంటే ఉలిక్కిపడి వెనుతిరిగాను.

ఆ అడుక్కునే ఆవిడ... ఛఛ గాయత్రీ టీచర్ "పావలా ఇవ్వవా..?" అంటూ నా ముందుకొచ్చి నిలబడింది. జేబులు వెతికాను. రూపాయికే విలువలేని ఈ కాలంలో పావలా ఎక్కడుంటుంది...? పెద్దనోటు ఇచ్చినా అది ఆమె తీసుకోదు.

ఆమెకు సహాయం చేయాలని ఉన్నా... ఏమీ చేయలేక నిస్సహాయంగా ఆర్ద్రమైన చూపులతో ఆమె వంక చూస్తూ ఉండిపోయాను. ఇస్తానని, ఇవ్వనని ఏదీ చెప్పని నావంక ఆవిడ విచిత్రంగా చూసి మరో వ్యక్తి దగ్గరికి వెళ్లి పావలా కావాలని యాచిస్తోంది.

✤





అవీ... ఇవీ

జోక్స్ : శ్రీకృష్ణ వరప్రసాద్



ఓ మనిషీ...

మనిషిగ పుట్టినందుకు
మహిలోన వెలుగు
ఇలలోన తారవై
విశ్వాన వెలుగొందు
నీ గొప్పలు చెప్పుకోకు
పదిమందీ గుర్తించేలా చూడు
అన్నీ కావాలని అత్యాశకు పోకు
కొన్నయినా కష్టపడి సాధించు
కాలంతోబాటు నువ్వూ మారు
లేకుంటే అక్కడే ఆగిపోయేవు

\- ఎం.ఎం. అబ్బాలోము

రిటార్టు

ఇరుగు పొరుగుల్తో కబుర్లాడి వచ్చిన భార్యను గసిరాడు ఆనందం.

"కలర్ టీవీ కొన్నదెందుకు? హాయిగా ఇంట్లో కూర్చొని టీవీ చూసుకోక ఎందుకా పాతకాలం కాలక్షేపం!"

"మీరు మాత్రం! ఆఫీస్ అవ్వగానే తిన్నగా ఇంటికొచ్చేయటం లేదూ పాతకాలం మొగుడిలా?!" రిటార్టు ఇచ్చింది ఆనందం భార్య.







మనుషుల్లా...

ఆడ చిలుక: కొత్త పిట్టను పట్టావేంటి? రాత్రి గూటికి రాలేదూ?!

మగ చిలుక: 'చిలుకా గోరింకల్లా బతకండి' అనే మనుషుల దీవెన నీ చెవుల పడినప్పట్నించే కదూ, నీకీ అనుమానం జబ్బు పట్టుకొందీ... వెర్రిదానా! కొందరు మనుషుల్లా నేను నీతీజాతీ తప్పనే!

బరువు తగ్గు

భార్య: ఏవండీ, వడ్డాణం చేయిస్తానంటూ వూరికే వూరిస్తున్నారు గానీ, ఎపుడు చేయించేది తేల్చరేం !

భర్త : నీ భారీ నడుముకి సరిపడే వడ్డాణమైతే నా తాహతుకి పదేళ్ళయినా పడుతుంది. ఓ పదిహేను కేజీలు బరువు తగ్గు, చూద్దాం...
అపుడు నువ్వు ఎపుడంటే అప్పుడే!

బాగుండదేమో!

"మొగుళ్ళతో మందు మాన్పించాలంటే ఒక్కటే దారి. మనమూ మందు కొట్టడం!" అందో విప్లవనారి.

"ఛ! బాగుండదేమో! తాగొచ్చినప్పుడు మీ నోరు కంపు కొడుతోందని, మనం అసహ్యించుకున్నట్టే వాళ్ళూ అసహ్యించుకుంటారు కదా!" అందో అమాయక నారి.





మతిమరుపు

టీచర్: నిన్న స్కూల్‌కి ఎందుకు రాలేదు?

స్టూడెంట్: మతిమరుపు వల్ల.

టీచర్: (వెక్కిరిస్తున్నట్లు) అంటే స్కూల్‌కి దారి మర్చిపోయావా?

స్టూడెంట్: కాదు టీచర్. శుక్రవారమని మర్చిపోయాను ఆదివారమనుకున్నాను.

పుణ్యం

ఓ భార్యా విధేయుడు: మీ యావిడ నిన్ను అంట్లు తోమ్మంటుందా?

మరో పెట్టమారి మగడు: లేదు. ఎప్పుడో ఓసారి బట్టలు మాత్రం ఉతకమంటుందంతే.

భార్యా విధేయుడు: ఏం పుణ్యంచేసుకున్నావో! నీకెంత తక్కువ పని చెప్పే పెళ్ళాం దొరికిందోయ్?!

ఫర్లేదు

విరి, గిరి ప్రేమించుకోవడం పూర్తయింది. అంతటితో ఆగక పెళ్లికీ తెగించారు. అంచేత పెళ్లయ్యాక ఎవరెలా ఉండాలనేది మాట్లాడుకోసాగారు.

"ఇక నువ్వు సిగరెట్లు మానేయాలేం!" అంది విరి గోముగా.

"ఏ, డబ్బు గురించా నీ చింత?" అడిగాడు గిరి.

'కాదు, నీ ఆరోగ్యం గురించి"

"అయితే నువ్వూ చీటికీమాటికీ ఐస్‌క్రీమ్‌లు తినొద్దేం! అలా మన డబ్బును కరిగించేయకూడదనే నేను చెబుతున్నా" అన్నాడు గిరి నిష్కర్షగా.

"నేను నీ ఆరోగ్యాన్ని కోరుకుంటూంటే, నువ్వు డబ్బు కోసం పాకులాడుతున్నావా? నీతో సంసారం సాగినట్టే!" అంది విరి మూతి బిగించి.

"ఫర్లేదు, నీకు అలాంటి అనుమానం ఏదైనా ఉంటే శోభనమైన మర్నాడే విడిపోదాం లే!"



అదేదో పావురంలా వుంది... పట్టేద్దామా?

నీ మొహం... అది యానిమల్ ప్లానెట్!

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
పర్సనాలిటీ
డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ :
9849130141

హిప్నో కమలాకర్

నా వయసు 28 సంవత్సరాలు. నేను ఒక చిన్న స్కూలు నడుపుతున్నాను. మా అన్నయ్యకు పెళ్ళయిందిగానీ ఏ పనీ చేయడు. ఏమైనా సంపాదించినా ఖర్చులకు పైసా కూడా ఇంట్లో ఇవ్వడు. వాళ్ళ కుటుంబ భారం కూడా మా నాన్నగారి పైన పడింది. ఇప్పుడు నా పెళ్ళి గురించి ఆలోచిస్తున్నారు. ఏమీ చేయలేని పరిస్థితిగా వుంది. మా చుట్టాలు నా పెళ్ళి గురించి అడుగుతుంటే ఆయన ఏమీ చెప్పలేకపోతున్నారు. నాకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలని ఉంది కానీ చేయలేకపోతున్నాను. ఈ ఆలోచనలతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నాను. నేనేం చేయాలో సలహా ఇవ్వగలరు.

సువర్ణ, కరీంనగర్

మీ పరిస్థితిని నేనర్థం చేసుకోగలను. అయితే అదే ఆలోచిస్తూ ఉండటంవల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. ఆ పరిస్థితిని మార్చడానికి ప్రయత్నిస్తేనే ఫలితముంటుంది. ఒకరు ఏదో అంటున్నారనే ఆలోచనను మీ మనసులోంచి తీసేయండి. ముందు మీ స్కూలు గురించి, మీ చదువు గురించి ఆలోచించండి. ఈ రోజుల్లో కులాంతర వివాహాలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. అయినా మీరింకా 'మా కులంలో చదువుకున్నవారు లేరు. నాకు పెళ్ళెలా అవుతుందో?' అని ఆలోచించటం ఏం బాగోలేదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలనుంది అన్నారు. కాబట్టి ముందు దానిగురించి ఆలోచించండి. ఎలాగూ స్కూలు నడుపుతున్న అనుభవం ఉంది కాబట్టి ఏదైనా కోచింగ్ సెంటర్‌లో ఫ్యాకల్టీగా జాయిన్ అయితే మీకు ఆర్థికంగా ఒక స్థిరత్వం వస్తుంది. అలాగే మీకు సంఘంలో ఒక స్థాయి కూడా ఉంటుంది. ఇక మీ అన్నయ్య విషయానికొస్తే మీకు పెళ్ళయ్యాక మీరెలానూ వేరే ఇంటికి వెళ్ళిపోతారు కాబట్టి ముందు మీ గురించి, మీ తల్లిదండ్రుల గురించి, మీ చదువు గురించి ఆలోచించండి. పరిస్థితులు అవే చక్కబడతాయి.

నా వయసు 19 సంవత్సరాలు. నాలుగేళ్ళుగా ఒకబ్బాయిని ఎంతగానో ప్రేమిస్తున్నాను. కానీ మా ఇంట్లో మా ప్రేమను అంగీకరించటం లేదు. మా ఇద్దరి కులం ఒకటే కావటంతో ఆ అబ్బాయి వాళ్ళింట్లో ఒప్పుకున్నారు. మావాళ్ళు మాత్రం అతన్ని చేసుకుంటే చచ్చిపోతామని బెదిరిస్తున్నారు. నేనేం చేయాలో పాలుపోవడంలేదు...

యామిని, మంగళగిరి

ప్రేమించుకునేవాళ్ళలో చాలామందికి వున్న ఇబ్బంది మీకు లేదు. ఎందుకంటే ఇద్దరి కులం ఒక్కటే. పైగా అబ్బాయి తల్లిదండ్రులు మీ పెళ్ళికి అంగీకారం తెలపడం మరో సానుకూల పరిణామం. ఇక మీ తల్లిదండ్రులు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారో నాకు తెలియటం లేదు. వారి అభ్యంతరాలు ఏమైనప్పటికీ చనిపోతామని బెదిరించటం మాత్రం ఏం బాగాలేదు. మీరు ముందుగా మీ ప్రేమ నిజాయితీతో కూడిందని మీ తల్లిదండ్రులకు తెలియజెప్పండి. ఆ అబ్బాయి తరపువారిని మీ తల్లిదండ్రులతో మాట్లాడమని, మీ పెళ్ళిగురించి ఒప్పించమని చెప్పండి. లేకపోతే వారే మీ పెళ్ళి చేస్తారని చెప్పమని చెప్పండి. అప్పుడు మీ తల్లిదండ్రులు అసలు కారణం చెబుతారు. అప్పటికీ వాళ్ళు ఒప్పుకోకపోతే రిజిష్టర్ మేరేజ్ చేసుకోవటం మినహా వేరే దారి లేదు. కాబట్టి ముందు మీ తల్లిదండ్రులకు గల అభ్యంతరం గురించి వాకబు చేయండి. వారి అభ్యంతరం సమంజసమైనదే అయితే మీ పెళ్ళి గురించి పునరాలోచించుకోండి. ఒకవేళ వారి అభ్యంతరం ఆస్తిపాస్తుల వంటి అనవసర భయాలైతే మాత్రం మీరు నిరభ్యంతరంగా పెళ్ళి చేసుకోండి.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ శ్రీ హిప్నోకమలాకర్ తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, ఫ్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

నేను అగ్రకులానికి చెందినదాన్ని. నేను ప్రేమించిన వ్యక్తి దళితుడు. మేం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. కానీ మా పెళ్ళికి ఇంట్లోవాళ్ళు ఒప్పుకోరనే భయంవల్ల అతనితో వెళ్ళిపోదామనుకున్నాను. అయితే మా నాన్నగారి పరిస్థితి ఏమవుతుందోనని భయంగా ఉంది. ఆయన పరువు పోతుందనే బాధతో ఆ సాహసం చేయలేకపోయాను. దాంతో అతనికి 'మన పెళ్ళి కుదరదని' చెప్పాను. అతనెన్నోసార్లు నాతో మాట్లాడాలని ప్రయత్నించినా నేను ఒప్పుకోలేదు. కానీ అతనంటే నాలో ఉన్న ఇష్టాన్ని చంపుకోలేకపోతున్నాను. నేనేం చేయాలో తోచటం లేదు.

లక్ష్మి, నిడదవోలు.

మీరు అతన్ని ప్రేమించానన్నారు. అతనేం చేస్తున్నాడో తెలియచేయలేదు. మీరు చదువుకుంటున్నారా? లేక ఏదైనా ఉద్యోగం చేస్తున్నారా? మీ నాన్నగారేం చేస్తున్నారు? అతని తాలుకువాళ్ళు ఏం చేస్తున్నారు? ఈ రోజుల్లో కులాంతర వివాహాలు చాలా సహజం. ఇందులో గొప్పకులం, తక్కువ కులం అనే తేడాలే లేవు. అన్ని కులాల్లోనూ కులాంతర వివాహాలు ఉన్నాయి. మీ నాన్నగారితో అతని గురించి, అతను మిమ్మల్ని ప్రేమిస్తున్న విషయం గురించి తెలియచేయండి. ఆ తర్వాత మీ నాన్నగారితో మీ ఇష్టాయిష్టాల గురించి కూడా తెలియచేయండి. అప్పుడు మీ నాన్నగారు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటారు. ఒకవేళ ఆయనకు ఇష్టం లేకపోతే మీరు అతన్ని మర్చిపోగలరా లేదా అనే విషయాన్ని కూడా మీ నాన్నగారికి తెలియచేయండి. అప్పుడాయన ఈ విషయంపై తొందరపడి నిర్ణయం తీసుకోకుండా ఉంటారు. ఈలోపు అతను మీతో ఏం మాట్లాడాలనుకుంటున్నాడో అతన్ని కలిసి తెలుసుకోండి. అతనేం చెబుదామనుకుంటున్నాడో తెలుసుకోకుండా మీరు అతన్ని తప్పించుకు తిరగటం రేపు ఏ అనర్థాలకూ దారి తీయకుండా చూసుకోండి. అతనింట్లో వాళ్ళు సంఘంలో ఒక మంచి స్థాయిలో ఉంటే, వారిని ఆ అబ్బాయి మీ పెళ్ళికి ఒప్పించిఉంటే వాళ్ళద్వారా మీ ప్రేమ, పెళ్ళి గురించి మీ నాన్నగారికి తెలియజేయించండి. మీరు అతన్ని మర్చిపోలేనని, మీరు ఒప్పుకోకపోయినా అతన్ని పెళ్ళి చేసుకుంటానని మీ నాన్నగారితో చెప్పండి. అయినా ఒప్పుకోకపోతే అప్పుడు రిజిష్టర్ మేరేజ్ చేసుకోవటం ఒక్కటే మార్గం కాబట్టి ఆలోచించి సరైన దిశగా అడుగేయండి. తొందరపడి ఏ నిర్ణయం తీసుకోకండి.



విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

మళ్లీ చంద్రలోక యాత్రలు

2015 నాటికి భారతీయ అంతరిక్ష నౌకలో ఒక భారతీయుణ్ణి చంద్రునిమీదకు పంపాలని మన అంతరిక్ష శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు. అనేక కారణాలవల్ల ఒకవేళ ఆలస్యమైనా 2020 నాటికి మాత్రం వారి ప్రయత్నాలు ఫలించగలవని నిపుణుల అంచనా. అంతకన్నా ముందే చంద్రలోక యాత్ర చేయాలని చైనీయులు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే అంతరిక్షంలోకి మానవుని పంపిన మూడో దేశంగా రికార్డు నమోదు చేసుకుని అంతరిక్ష పరిశోధనలో అగ్రదేశాలను అధిగమించడానికి ప్రయత్నిస్తోన్న చైనీయులు చంద్రయానం చేసే రోజులు అట్టే దూరంలో లేవని పరిశీలకులు చెబుతున్నారు.

ఇప్పటివరకు చంద్రునిమీదకు మనుషులను పంపిన దేశం అమెరికా మాత్రమే. నాటి సోవియట్ యూనియన్ మనిషిని పంపలేదుగాని చంద్రునిమీదకు వాహనాలు పంపి అక్కడినుండి మట్టీ వగైరా తెచ్చి పరిశోధనలు చేసింది. అమెరికాకు చెందిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ 1969లో అపోలో-11 వ్యోమనౌకమీద తొలిసారి చంద్రునిపై కాలు మోపాడు. తరువాత మూడేళ్ల కాలంలో అమెరికా 6 అంతరిక్ష వాహనాలను పంపింది. అందులో అపోలో-13 సాంకేతిక లోపాల వల్ల చంద్రునిమీదకు వెళ్లకుండానే తిరిగి వచ్చేసింది. మొత్తం 12 మంది అమెరికన్లు చంద్రునిపై దిగి అనేక రకాల పరిశోధనలు చేశారు. 1972లో ప్రయోగించబడిన అపోలో-17 చంద్రునిపైకి వెళ్లిన చివరి మానవసహిత వాహనం. ఆ తరువాత అంతరిక్ష పరిశోధనలు చాలా జరిగాయి. గ్రహాంతరాల్లోకి మానవుడు పంపిన యంత్రాలు దూసుకుపోయాయి. అనేక వింతలూ, విడ్డూరాలూ భూమ్మీదకు పంపాయి.

కాని ఎందుకో మానవునికి చంద్రునిమీద ఆసక్తి తగ్గిపోయింది. మానవసహిత యాత్రల మాట అటుంచితే మానవ రహిత వాహనాలు పంపడం కూడా ఆగిపోయింది. అమెరికా, సోవియట్‌లు అంతరిక్షయానాల్లో ఇతర దేశాలకు అందనంత దూరం ఎదిగిపోవడం, ఇతర దేశాల సాధనసంపత్తి చంద్రుని దగ్గరకు కాదు సరికదా, కనీసం అంతరిక్షంలోకి వ్యోమనౌకలు పంపడానికి కూడా అంతగా సరిపోకపోవడం వంటి కారణాలు ఒకవైపు, మరోవైపు చంద్రలోక యాత్రలవల్ల ఖర్చేగాని కొత్తగా తెలుసుకునే విషయాలేమీ లేకపోవడం చంద్రయానాలకు అంతరాయం కలిగించింది.

అయితే మూడున్నర దశాబ్దాల తరువాత ప్రపంచమంతా మరోసారి ఇప్పుడు చంద్రలోక యాత్రలగురించి మాట్లాడుతోంది. చైనా, భారత్ వంటి వర్ధమానదేశాలు అంతరిక్ష పరిశోధనల్లో ముందుకు వచ్చి అగ్రరాజ్యాల సరసన చేరడం, కొత్తగా సంపాదించుకున్న పరిజ్ఞానంతో అవి చంద్రలోక యాత్రలకు సన్నాహాలు చేస్తుండడంతో అగ్ర రాజ్యాల్లో కూడా చలనం వచ్చింది. సోవియట్ విచ్ఛిన్నం తరువాత రష్యా కొత్తగా అంతరిక్ష పరిశోధనలకు డబ్బు పెట్టగల స్థితిలో లేదు. అది తనవద్ద ఉన్న అంతరిక్ష సదుపాయాలనే ఇతరులకు అద్దెకు ఇవ్వడంద్వారా నెట్టుకొస్తోంది. కాని అమెరికా మాత్రం కొత్త పోటీని తట్టుకుని ముందు నిలవడంకోసం కొత్త ఎత్తుగడలతో ముందుకొస్తోంది. మళ్లీ చంద్రునివద్దకు వెళ్లాలా వద్దా అన్నది అమెరికా జాతీయ వైమానిక, అంతరిక్ష సంస్థ- 'నాసా' వర్గాల్లో నిత్యం చర్చనీయాంశమే. అయితే 'అంతరిక్షాన్ని మథించండి, మన సౌరకుటుంబమంతటా మానవ ఆవాసాలు ఏర్పరచండి' అంటూ 2004 జనవరి 14న అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ పిలుపివ్వడంతో నాసా శాస్త్రవేత్తల్లో కలకలం ప్రారంభమైంది. మానవుని గ్రహాంతర యానాలకు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభమైనాయి. బహుశా చైనా, భారత్ వంటి దేశాలనుండి వస్తోన్న పోటీని దృష్టిలో పెట్టుకునే వాటికన్నా తాము వెనకబడిపోకూడదనే బుష్ ఈ ప్రకటన చేసి ఉంటారు.

ప్రస్తుతం చంద్రమండల యాత్రకోసం నాసా ముమ్మరంగానే ప్రయత్నాలు చేస్తోంది. 2008లో అమెరికా మరోసారి చంద్రమండలం మీదికి ఒక వ్యోమనౌకను పంపబోతున్నది. అయితే ఈసారి అది పంపబోతున్న వ్యోమనౌక లక్ష్యాలు గతంలో పంపిన నౌకల లక్ష్యాలకు భిన్నమైనవి. గతంలో చంద్రలోకాన్ని పరిశీలించడం, పరిశోధించడం లక్ష్యం. కాని ఇప్పుడు అమెరికా కొత్తగా తలపెట్టబోతున్న చంద్రయానాల లక్ష్యం పూర్తిగా వాణిజ్యపరమైంది. చంద్రునిపై గనులు తవ్వడం, ఇతర గ్రహయాత్రలకు చంద్రుని ఒక మజిలీగా ఉపయోగించుకోవడం తక్షణ లక్ష్యాలు. కాలక్రమంలో 'స్పేస్ టూరిజం'తోబాటు ఇంకా అనేక రకాలుగా చంద్రోపరితలాన్ని ఉపయోగించుకోవచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా భూమ్మీద ఇంధన అవసరాలు పెరిగిపోతున్నకొద్దీ మానవునికి ఇంధనం సరఫరా చేసే కేంద్రంగా చంద్రమండలం రూపుదిద్దుకోబోతోంది. అందుకనే ఈనాడు అమెరికా ప్రభుత్వమూ, నాసాలు మాత్రమే కాకుండా అమెరికాలోని బడా ప్రైవేటు సంస్థలు చంద్రునిపై వలసలు ఏర్పాటుచేసుకోడానికి ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

ఒకనాడు సముద్రంపై ఆధిపత్యం సాధించిన ఇంగ్లండూ, ఇతర యూరప్ దేశాలూ ఈ భూగోళాన్నంతటినీ ఆక్రమించుకుని వలసలు ఏర్పాటుచేశాయి. ఇప్పుడు అంతరిక్షంపై ఆధిపత్యం వహించిన అమెరికా ఇతర గ్రహాలను ముఖ్యంగా చంద్రమండలాన్ని వలసగా మార్చుకోడానికి ప్రయత్నిస్తున్నది. చంద్రమండంపై ఆధిపత్యంవల్ల ఒనగూరే ప్రయోజనాల గురించి తెలుసుకుంటున్న కొద్దీ చంద్రలోక యాత్రలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఇప్పటికిప్పుడు చంద్రునిపై గనులు తవ్వి ఇంధనాన్ని వెలికితీసే పరిశ్రమలు నెలకొల్పే సామర్థ్యం నాసా వద్ద ఉందని, కావలసిందల్లా పెట్టుబడి మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడుల అవసరం తీర్చడానికి ప్రైవేటు కంపెనీలను భాగస్వాములుగా చేసుకోవాలని సూచిస్తున్నారు. తగిన లాభాలు వస్తాయంటే ప్రైవేటు పెట్టుబడులు చంద్రలోకానికే కాదు నరకానికి వెళ్లడానికైనా సిద్ధంగా ఉంటాయి కదా! అందువల్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడం కోసం ఆకాశంలో చుక్కల్ని చూపించినట్లు చంద్రునిమీద బ్రహ్మాండమైన పరిశ్రమలనూ, వాటినుండి బ్రహ్మాండమైన లాభాలనూ చూపిస్తున్నారు నిపుణులు. వాటి కథాకమామీషు తరువాత తెలుసుకుందాం!

♣

కొత్త పుస్తకాలు

బతుకుకు సహాయపడేది

మాటసాయంతో చాలా పనులు, పరిస్థితులూ చక్కబడ్తాయి. సమస్యలకు పరిష్కారాలూ లభిస్తుంటాయి. మాటకి ముఖ్యంగా మంచిమాటకి అంతశక్తి వుంది. ఇటీవల అబ్బూరి ఛాయాదేవి నిర్వహించిన కాలమ్ 'మాటసాయం' పుస్తకరూపం ధరించింది. ఆ పుస్తకాన్ని సొంతం చేసుకుని (బెగ్, బారో ఆర్ స్టీల్ - ఈ మూడింటినీ ఎన్నో రెట్లు మించే ఉత్తమ పద్ధతి కొనుక్కోవటం) బోల్డన్ని మంచిమాటల్ని అందుబాటులో వుంచుకున్నామంటే అడపాదడపా సహాయానికొస్తాయి.

గ్లోబలైజేషన్ ప్రభావంతోగానీ, స్వార్థం వెర్రితలలు వేయటానగానీ ఇప్పుడు మనుషులు ఎవరికి వారే యమునాతీరేగా బతకటం మరీ ఎక్కువైంది. సంఘజీవిగానే మనుగడ అని తెల్సుకుని సమాజాన్ని ఏర్పాటు చేసుకున్నారు మనుషులు. కానీ కొందరు ప్రస్తుతం ఏవేవో వికృత ధోరణులకు లోనై ఒంటరిదీవులైపోతున్నారు. అలాంటివారికి ఈ పుస్తకం బాగా ఉపకరిస్తుంది. (అలాంటివారు అనటాన్ని ఓ విమర్శలా చూడకుండా ఆత్మవిమర్శకు ప్రేరేపించే మాటలా అర్థంచేసుకోవాలని మనవి) తక్కినవారు ఇందులోని జీవితసత్యాలు, వాస్తవాలతో జీవించటమనే కళను (ఆర్ట్ ఆఫ్ లివింగ్) మరింత తీర్చిదిద్దుకుంటారు.

శ్రీరమణ ముందుమాట 'నవ్య తరపున నా మాట'లో చెప్పినట్టు 'మాట సాయం వ్యాస పరంపరలో జిడ్డు కృష్ణమూర్తి చేతన అంతర్లీనంగా వుంది. ప్రస్తుత సమాజం తీరుతెన్నుల గురించీ, మన సమస్యల మూలాల గురించీ వివరణ వుంది. కొందరికైనా ఇది అక్షరాలా మాటసాయంగా ఉపకరించిందనడం అత్యుక్తి కాదు'. ఆయనకు తెలిసి కొందరు, తెలీకుండా ఎందరో. ఈ పుస్తకం ప్రత్యేకత గురించి ఇంకా తెల్సుకోవటం కంటే చదువుకోవటం ఎంతో బాగుంటుంది. ఈ మాటను మీరు పుస్తకం చదివాక ఒప్పుకుంటారు.

(మాట సాయం, అబ్బూరి ఛాయాదేవి, వెల: 90/-, పేజీలు: 178, ప్రతులకు: ఉమా బుక్స్, న్యూ బోయినపల్లి, సికింద్రాబాద్, ఇంకా అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో)

- శ్రీకృష్ణ వరప్రసాద్



అమృతం చెట్టు

డా॥ రావి రంగారావు
వెల: 20/-, పేజీలు: 56
ప్రతులకు:
నర్రా ప్రభావతి ఎం.ఎ.ఎం.ఇడి
డోర్. నెం. 4-290, చల్లా వారి స్ట్రీట్
గొడుగు పేట
మచిలీపట్నం- 521 001.

బొంగరం

యెన్నం సత్యం
వెల: 60/-
పేజీలు: 68
ప్రతులకు:
2-4-76,
శారదానగర్
సిరిసిల్లా- 505 301



చిట్టెలుక-పెన్సిల్

ఈ చిన్న పుస్తకంలో టూకీగా వున్న మూడు కథలు, వాటికి తగ్గ బొమ్మలు లక్షణంగా ఉన్నాయి. అంటే పిల్లలకు బాగా నచ్చే లక్షణం కలిగివున్నాయవి. చదవగల పిల్లలు చదివి ఆనందిస్తారు. ఇంకా బడికి వెళ్ళని చిన్నపిల్లలకు తల్లిదండ్రులో, మామ్మలూ, మావయ్యలో చదివి విన్పిస్తూ బొమ్మలు చూపిస్తూ కథను చెప్పవచ్చు. అలా పిల్లలకు కథలు చెప్పే ఒకప్పుడున్న చక్కటి సంప్రదాయాన్ని కొనసాగించేందుకు అనువైన కథలివి.

(చిట్టెలుక-పెన్సిల్ సంకలనం, పునఃకథనం: పి. రాజేశ్వరరావు, వెల: 30/-, పేజీలు: 32, ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌజ్, ప్రముఖ పుస్తక విక్రేతలు, ప్రతిభ పబ్లికేషన్స్, ప్లాట్ నంబర్-2, శ్రీ శంకర్ కాలనీ, ఎల్.బి.నగర్, హైద్రాబాద్)

చిట్టెలుక-పెన్సిల్ కథను చదవటంతో ఊరుకోనక్కర్లేదు. బాలలను పిల్లిబొమ్మ గీయమని ప్రోత్సహించవచ్చు. ఈ ప్రోత్సాహం వారిలో భావి చిత్రకారుడికి స్ఫూర్తినివ్వచ్చు. అలాగే కోడిపుంజు రంగులు కథలో పుంజు, కోడిపిల్లలకు రంగులు వేయటం బాలలకు ఉత్సాహం కలిగిస్తుంది. అలా వారిలో సృజనాత్మకత వెలికిరావచ్చు.



మూడు ఎలుగుబంట్లు కథ సుప్రసిద్ధ రష్యన్ రచయిత లెవ్ తోల్‌స్తాయ్ రాసినది. ఆపద ఎదురైనపుడు యుక్తితో ఎలా తప్పించుకోవచ్చో ఇందులో చెప్పారు.

- మోనాలిసా

కావలసిన పదార్థాలు

పాలు - అరలీటరు
పాల పొడి - 10 గ్రాములు
పంచదార - పావు కిలో
నెయ్యి - 200 గ్రాములు
మైదా - 1 టీ స్పూను
రోజ్ ఎసెన్స్ - 1 చుక్క
నెయ్యి (పేరినది) కొంచెం

తయారు చేసే పద్ధతి

పాలల్లో పాలపొడి కలిపి బాగా మరగకాయాలి. పాలు ముద్దగా అయ్యేవరకూ మరగబెట్టాలి. దీన్నలా ఉంచి ఈ ముద్దకి సరిగ రెట్టింపు పంచదార ఒక పాత్రలో వేసి తీగపాకం రాగానే దించి, అందులో ఎసెన్స్ కలిపి వేరుగా ఉంచుకోవాలి. మైదాలో పేరిన నెయ్యి వేసి బాగా కలపాలి. ఈ మైదా ముద్దకు పాలకోవా చేర్చి రెండూ బాగా కలపాలి. కళాయిలో నెయ్యి పోసి బాగా కాగనిచ్చి, పైన చెప్పిన ముద్దని ఉండలుగా చేసి నేతిలో వేయించాలి. ఎరుపు రంగు రానిచ్చి పాకంలో వెయ్యాలి. ఉండలు పాకాన్ని పీల్చుకొని రుచిగా ఉంటాయి.

గులాబ్ జామ్

రుచి

కావలసిన పదార్థాలు

పచ్చిబఠాణీలు - రెండు కప్పులు
కొత్తిమీర - అరకప్పు
కరివేపాకు - రెండు రెబ్బలు
పచ్చిమిర్చి - రెండు స్పూన్‌లు
వెల్లుల్లి పేస్ట్ - కొద్దిగా
టొమేటో ముక్కలు - అరకప్పు
ఉల్లిపాయ తరుగు - అరకప్పు
మసాలా పొడి - అరస్పూన్
ఉప్పు - తగినంత
నూనె - రెండు స్పూన్‌లు

తయారు చేసే పద్ధతి

పచ్చి బఠాణీలను ఓ పూట నీటిలో నానబెట్టి ఆ తరువాత ప్రెషర్‌ప్యాన్‌లో కొద్దిగా ఉప్పువేసి ఉడికించుకోవాలి. తరువాత నీరుతీసేసి, మూకుట్లో నూనె కాగనిచ్చి పచ్చిమిర్చి, వెల్లుల్లి పేస్ట్, కరివేపాకు, బఠాణీలు వేసి కాసేపు వేగనివ్వాలి. తరువాత ఉప్పు, మసాలా పొడి చల్లి దించుకోవాలి. ఉల్లితరుగు, టొమేటో ముక్కలు, కొత్తిమీర కలపాలి. బఠాణీ ఛాట్ సిద్ధం.

పచ్చిబఠాణీలతో ఛాట్

- జ్యోతి



జరిగిన కథ

ఓసారి తాతకు గాయపడిన పిచ్చుక కనిపిస్తుంది. జాలిగుండెగల తాత దాన్ని ఇంటికి తీసుకెళ్లి సపర్యలు చేస్తాడు. అవ్వకు ఇదంతా నచ్చదు. ఓరోజు దానికి తిండి పెట్టకుండా మాడ్చుతుంది అవ్వ. పాపం పిచ్చుకకు ఆకలేసి ఇంట్లోవున్న గంజి మొత్తం తినేస్తుంది. అవ్వకు కోపం వచ్చి పిచ్చుక నాలుక కత్తిరించబోతుంది. కానీ పిచ్చుక ఎలాగో తప్పించుకుని వెళ్లిపోతుంది. ఇదంతా తెల్సిన తాత విచారిస్తాడు. దాన్ని వెతుకుతూ అడవిలోకి వెళతాడు. చాలా దూరం వెళ్లాక ఆయనకు కొన్ని పిచ్చుకలు కన్పిస్తాయి. తర్వాత...

అవ్వ అత్యాశ

చూటీ

పిచ్చుకలు తాతను చూడగానే సంతోషించాయి. "నువ్వు వస్తావని మేం అనుకుంటూనే వున్నాం. ఇంకొంచెం ముందుకెళ్లు తాతా! అక్కడ వెదురుతోపు ఉంటుంది. అక్కడే మా వాళ్లంతా నివసిస్తారు" అని కూడా చెప్పాయి. తాత సంతోషంగా ముందుకు నడిచాడు. అక్కడ ఆయనకు బోలెడన్ని పిచ్చుకలు కనిపించాయి.

ఈలోగానే చిన్నారి పిచ్చుక ఆనందంగా ఎగురుకుంటూ తాత దగ్గరకు వచ్చి లోపలికి ఆహ్వానించింది. దాన్ని చూడగానే ఆయనకు కళ్లెంట నీళ్లు వచ్చాయి. "ఓ నా పిచ్చుకా! ఎలా ఉన్నావు? బావున్నావు కదా. నేను నిన్ను తిరిగి చూస్తాననుకోలేదు. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది" అంటూ దాన్ని చేతుల్లోకి తీసుకుని నిమిరాడు.

పిచ్చుక తాతకు మంచి రుచికరమైన ఆహారం పెట్టి చక్కగా డాన్స్ చెయ్యసాగింది. దాని డాన్స్ చూసి తాత చాలా సంతోషించాడు. కాసేపటి తర్వాత లేచి నిలబడి "పిచ్చుకల్లారా! నాకు ఇక్కడ ఇంకాసేపు వుండాలని ఉంది. కానీ ఇంటి దగ్గర నా భార్య కంగారుపడుతుంది. అందుకని వెళుతున్నాను. ఏమనుకోకండి" అంటూ బయలుదేరాడు.

అప్పుడు పిచ్చుకలన్నీ కలిసి రెండు బుట్టలు తెచ్చి తాత ముందు పెట్టి "తాతా! నీ కోసం మా బహుమతి. నీకు ఏది కావాలంటే అది తీసుకో. కాకపోతే ఇంటికెళ్లాక మాత్రమే తెరిచి చూడు. మధ్యలో తియ్యకు" అన్నాయి. దానికి తాత సంతోషంగా "నేను బాగా ముసలివాడినయ్యాను. ఎక్కువ బరువు మొయ్యలేను. అందుకే మీ తృప్తి కోసం ఈ చిన్ని బుట్ట తీసుకెళతాను" అన్నాడు. అందుకు పిచ్చుకలన్నీ సంతోషంగా తాతకు వీడ్కోలు పలికాయి.

❀ ❀ ❀

తాత ఇల్లు చేరాక పెద్దగా "ఏమేవ్ ఎక్కడున్నావ్? నేను నా చిన్నారి పిచ్చుకను చూశాను. అంత జరిగినా కూడా అది నన్ను చూసి చాలా సంతోషించింది. నాకు చిన్ని బహుమతి కూడా ఇచ్చింది. ఇదిగో ఈ బుట్టలో ఏదో ఉంది. తీసి చూద్దాం రా" అన్నాడు. ఆ మాటలకు అవ్వ పరుగు పరుగున వచ్చి చూసి సంతోషించినా అంతలోనే... "మరీ ఇంత చిన్న బుట్టే తెచ్చావా?" అంది అసంతృప్తిగా.

దానికి తాత బోసినోటితో నవ్వుతూ... "నీకు తృప్తి లేదే. నా బంగారు పిచ్చుక రెండు బుట్టలు ఇచ్చి ఏదో ఒకటి తీసుకెళ్లమంది. నేనేమో పెద్ద బుట్టను మోయలేక చిన్నదాన్ని తీసుకొచ్చాను" అంటూ బుట్టను తెరిచాడు. అందులో బంగారం, వజ్రాలు, పట్టు వస్త్రాలు, ముత్యాలు, పగడాలు, డబ్బులు... వున్నాయి.

వాటిని చూడగానే అవ్వ నిశ్చేష్టురాలైంది. తర్వాత మెల్లగా తేరుకుని "ఎంత పిచ్చి పని చేశావయ్యా! ఎంచక్కా పెద్ద బుట్ట తెస్తే బావుండేది కదా. మనకు ఇంకా బోలెడన్ని నగలు, వజ్రాలు... వచ్చేవి" అంది. అప్పుడు తాత అయిష్టంగా "నేను మొయ్యలేక తేలేదులే. కావాలంటే నువ్వు వెళ్లి తెచ్చుకో" అన్నాడు.

❀ ❀ ❀

తాత అన్నంత పనీ చేసింది అవ్వ. మరునాడు పొద్దున్నే అవ్వ కూడా పిచ్చుక దగ్గరకు బయలుదేరింది. దారి పొడవునా అడుగుతూ ఎలాగైతేనేం పిచ్చుక వుండే చోటుకు చేరింది. పిచ్చుక అవ్వను చూసి సంతోషించి తినడానికి రుచికరమైన పదార్థాలు పెట్టింది.

వాటిని చూసి "నాకు ఆకలిగాలేదు. నేను నిన్ను ఎంత బాగా చూసుకున్నాను. గుర్తులేదా? బహుమతి బుట్టలు తీసుకురా పో. నేను వెళ్లాలి" అంది. పాపం పిచ్చుకలు ఆ మాటలకు నిరుత్సాహపడిపోయినా రెండు పెద్ద పెద్ద బుట్టలు తెచ్చి అవ్వ ముందు పెట్టాయి. అవ్వ వాటిలోంచి పెద్దది తీసుకొని "నేను చాలా బలంగా ఉన్నాను. దీన్ని తీసుకెళతాను" అంటూ బుట్టను చేతపుచ్చుకుని బయలుదేరింది. పిచ్చుకలన్నీ కలిసి "అవ్వా! దీన్ని మధ్యలో తెరచి చూడకు. ఇంటికెళ్లాకే తీసి చూడు" అన్నాయి. అలాగేనంటూ తలూపి ముందుకు కదిలింది అవ్వ.

అలా చాలా దూరం నడిచాక అవ్వ ఆగలేకపోయింది. బుట్టలో ఏముందో చూడాలనుకుంది. ఓ చెట్టు కింద కూర్చుని మెల్లగా బుట్ట తీసింది. ఇంకేముంది? ముందు బుట్టలోంచి పొగ వచ్చింది. తర్వాత ఒంటికన్ను డేగలు, పెద్ద పెద్ద పాములు, డైనోసార్లు... బయటకు వచ్చాయి. వాటిని చూసి అవ్వ భయపడిపోయింది. వణుకుతూ... బుట్టను కింద పడేసి పరుగెట్టపోయింది. కానీ హడావిడిలో కాలు మెలికపడి ఎత్తులోంచి దొర్లుకుంటూ దొర్లుకుంటూ లోయలోకి జారిపోయింది. అత్యాశకు పోతే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో అవ్వకు అప్పుడు అర్థమైంది. (అయిపోయింది)

బాలల కథ